Rs. 12/- per copy

విద్యార్థి జ్వాల

Vol. 31 - No.4

February 2025

5లో

సంసారం సంతోషంగా సాగాలంటే?

అతిథి సంపాదకీయం

'సాటి' నా? 'పోటీ' నా?

వారిది సుదీర్ఘ సంసార జీవితం. యాజక సేవ బాధ్యతలతో సాగిపోతున్నారు. సంతానం కోసం సంవత్సరాలుగా ప్రార్థన చేశారు. భార్యకు సంతానోత్పత్తి కలిగే వయస్సు దాటిపోయింది. ఆ కుటుంబాన్ని గూర్చి వైద్యుడైన లూకా "వారిద్దరూ దేవుని వాక్యంలో కలిసి నడుస్తూ, ఎదుగుతూ, సేవచేస్తూ సంసారం చేస్తున్నారని" రాశాడు. ఆ ఇద్దరూ ఎవరో కాదు జెకర్యా, ఎలీసబెతు దంపతులు. వారు కుటుంబ జీవితంలో సవాళ్ళు, సమస్యలు, లోటు, సిగ్గు, అవమానాలు ఎదుర్కొంటున్నప్పటికీ భార్యాభర్తలుగా ఇద్దరూ కలిసి దేవునితో, ఒకరితో ఒకరు నడుస్తూ దేవుని మాటలను అనుసరిస్తూ సమస్యల మధ్యలో కూడా చెరగని సంతోషం, సమాధానం, సమైఖ్యత, సంతృప్తితో జీవించారు.

కుటుంబాల్లో సమస్యలు, సవాళ్ళు, లోటులు ఉన్నా ఎల్లప్పుడూ సంతోషంగా, సమాధానంగా, సంతృప్తితో కలిసి జీవించడం చాలా మందికి కలవరంగా, కఠినంగా, కత్తిమీద సాముగా ఉంటుంది. దానికి కారణాలేంటో తెలుసుకోవాలంటే మూలాల్లోకి వెళ్ళాలి.

ఆదికాండము మొదటి అధ్యాయంలో సృష్టి ప్రణాళికలో దేవుడు స్త్రీ, పురుషులను సృష్టించి, ఆశీర్వదించి, వివాహంలో జతపరిచి, కుటుంబ వ్యవస్థను ఏర్పరిచి ఇద్దరినీ ఫలించి, అభివృద్ధి చెంది విస్తరించమని, కలిసి ఏలమని, మంచి గృహ నిర్వాహకులుగా ఉండమని సూచించాడు. అయితే మూడవ అధ్యాయంలో పతనం తర్వాత ఆది దంపతుల సంబంధంలో దూరం, నెపాలు మోపుకోవడం చోటుచేసుకొన్నాయి. పాపము, శాపము ఫలితంగా భార్య తన స్త్రీత్వము ద్వారా భర్త యాజమాన్యాన్ని, నాయకత్వాన్ని సొంతం చేసుకోవాలనే ఆశ, భర్త అయితే దేవుడు తనకిచ్చిన యజమాన్యం ద్వారా భార్యను అణిచి వేసే ప్రయత్నం మొదలైంది. తద్వారా కుటుంబంలో ఉండాల్సిన సంతోషం, సమాధానం, ఐక్యత, నెమ్మది, ప్రేమ, గౌరవం పోయి కించపరచుకోవడం, హీనపరుచుకోవడం, 'సాటి'కి బదులు 'పోటీ' పడడం, సహాయానికి బదులు అపకారము, స్వార్థపూరితంగా ఉండడం, ప్రేమ స్థానంలో హింస, సంతోషం స్థానంలో విషాదం అలుముకొన్న పరిస్థితి చూస్తున్నాము.అయితే దేవుడు ఆదిలో శపిస్తూనే విమోచనను వాగ్దానం చేశాడు. దేవుడు దైవిక కుటుంబాల ద్వారా విమోచకుణ్ణి అందించి, లోకానికి విమోచనను ప్రసాదించాడు. కావున క్రీస్తు ప్రభువులోని దేవుని విమోచన ప్రణాళికలో, సువార్త పరిచర్యలో కుటుంబాలు భాగస్వాములయ్యాయి. ఈ సత్యం గూర్చి అవగహన లేని అజ్ఞానం ఒకప్రక్క, అవగాహన ఉన్నా దానిని ధిక్కరించడం వల్ల నేటి క్రైస్తవ విశ్వాస కుటుంబాలలో భార్యాభర్తల మధ్య సఖ్యత లేకపోవడం, నమ్మకంగా ఉండకపోవటం, ధనాన్ని గురించిన వివాదాలు, మెటీరియలిజం, కన్‌జ్యూమరిజం, ఇండివిడ్యువలిజం లాంటి పోకడలు చూస్తున్నాము. స్వార్థం, ఎవరి సుఖం, సౌఖ్యం వారు వెతుక్కోవడం, ధనాపేక్షతో లేట్ అవర్స్ పని చేయడం, ఇద్దరూ కలిసి గడిపే సమయానికి విలువ నివ్వకపోవడం, ఒకే ఇంటిలో, ఒకే మంచంపై ఉండి కూడా ఎంతో దూరంగా, ఒంటరిగా ఎవరికి వారే యాతన పడుతున్న పరిస్థితి.

ఇలాంటి పరిస్థితులను చక్క దిద్దుకొని దైవిక మార్గంలో సాగాలంటే, దేవుని వాక్య వెలుగులో కుటుంబాన్ని గురించిన దేవుని గొప్ప ఉద్దేశాలను, సత్యాలను తెలుసుకొని వాటిని అనుసరించి ఘనపరచడం ద్వారానే దేవుడు కుటుంబాల్లో ఉంచిన సంతోషాన్ని, సమాధానాన్ని, సమైఖ్యతను, సంతృప్తిని సమృద్ధిగా అనుభవించగలం. దేవునికి, ఇశ్రాయేలు జనాంగానికి మధ్య సంబంధాన్ని వివరించడానికి దేవుడు భార్యాభర్తల సంబంధాన్ని సూచించాడు. దీనిని నూతన నిబంధనలో క్రీస్తు ప్రభువుకు సంఘానికి మధ్య సంబంధాన్ని సూచించే సజీవ ఉపమానం అన్నారు. కాబట్టి విశ్వాసి అయిన భర్త వివాహంలో క్రీస్తు ప్రభువు పాత్ర పోషిస్తే, భార్య సంఘం పాత్ర పోషిస్తుంది. ప్రతి రోజు అలాంటి రోల్స్ ఇద్దరూ ప్లేచేయాలి. ఇద్దరికీ మాదిరి ప్రభువే. భర్త ప్రభువులా ప్రేమించడానికి, పోషించడానికి, సంరక్షించడానికి, భార్య బలహీన ఘటమని ఎంచి సున్నితంగా, భద్రంగా చూడడానికి తనని తాను ట్రైన్ చేసుకోవాలి. భార్య కూడా భర్తను శిరస్సుగా అంగీకరించి అతని నాయకత్వాన్ని, యాజమాన్యాన్ని, యాజకత్వాన్ని గౌరవిస్తూ వెంబడించాలి, లోబడాలి. సంసారంలో భార్యాభర్తలు ఇద్దరూ ఒకరిని ఒకరు ప్రేమించుకోడానికి, గౌరవించుకోవడానికి, క్షమించుకోవడానికి పోటీ పడినప్పుడు ఆ సంసారంలో సంతోషమే సంతోషం. నెమ్మదే నెమ్మది.

మన సమస్య అజ్ఞానం కాకూడదని కుటుంబ వ్యవస్థను గూర్చిన బోధ ఎంతో తరచుగా మనకు అందించబడుతుంది. మరి ఈ బోధను గూర్చిన దేవుని జ్ఞానము కలిగి కూడా అహంకారంతో దుష్టడి ఆలోచనలకూ, స్వార్థానికి తావిస్తూ సంబంధాలను పాడు చేసుకొని ఆ సన్నిహిత సంబంధంలోని సమాధానాన్ని, సంతోషాన్ని, సుఖాన్ని, సౌఖ్యాన్ని, సంతృప్తిని పోగొట్టుకోకూడదు. కుటుంబాలుగా కలిసి ప్రార్థిద్దాం, కలిసి సేవలో పాల్గొందాం. ఒకరికి ఒకరు పోటీగా కాకుండా సాటియైన సహాయంగా ఉందాం. కుటుంబంలో సమస్యలు ఉంటే, అవసరమైతే మన పెద్దల దగ్గర యధార్థంగా సలహా, సూచన, సహాయం పొందుదాం. శ్రద్ధ కలిగి ప్రభువిచ్చే సంతోషాన్ని, సమాధానాన్ని, సమైఖ్యతను, సంతృప్తిని కాపాడుకొందాం. సంఘాన్ని, సమాజాన్ని ప్రభావితం చేద్దాం.

– బి.రంగనాథం, డా. జె. రత్న గ్రేస్, వైజాగ్

విద్యార్థి జ్వాల

Vol. 31, No. 4. February 2025
A Publication of
Union of Evangelical Students of India

EDITORIAL BOARD:
Mr. B.J. Lazarus, Editor
Mr. P. Sunil Jacob - Associate Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.

SUBSCRIPTION CHARGES:
STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years)
Rs. 2000/-

FOR SUBSCPRICTION:
The prescribed subscription charges can be paid using the account / UPI id / QR code, fill the details in the google form (https://bit.ly/SubscriptionForVJ) and inform the same to Editor VJ through whatsapp.

Account Name : UESI Publication Trust, Andhra Pradesh
Account No : 43362371247,
SBI Nambur Branch
IFSC: SBIN0011994
Merchant Name: UESI PUBLICATION TRUST ANDHRA PRADESH
UPI ID : uesiptap@sbi

CONTACT:
The Editor
Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

UPCOMING TOPIC:
March: Missions

ఒకరినొకరు

ఒకరినొకరు ప్రేమించాలి - యోహాను 13:34
ఒకరినొకరు క్షమించాలి - ఎఫెసీ 4:32
ఒకరినొకరు ఆదరించాలి - 1థెస్స 4:18
ఒకరికొకరు క్షేమాభివృద్ధి కలుగజేసుకోవాలి - 1 థెస్స 5:11
ఒకరికొకరు పరిచర్య చేయాలి - 1 పేతురు 4:10
ఒకరినొకరు భరించాలి - కొలస్సీ 3:13
ఒకరినొకరు హెచ్చరించాలి - హెబ్రీ 10:25
ఒకరి భారములు ఒకరు భరించాలి - గలతీ 6:2
ఒకరినొకరు సేవించాలి - గలతీ 5:13
ఒకరికొకరు వందనాలు చెప్పాలి - రోమా 16:16
ఒకరితోనొకరు సమాధానం కలిగి ఉండాలి - మార్కు 9:50
ఒకరినొకరు చేర్చుకోవాలి - రోమా 15:7
ఒకరితోఒకరు కలిసి ఉండాలి - రోమా 12:15-16
ఒకరికొకరు సణగకుండా ఆతిథ్యం ఇవ్వాలి - 1 పేతురు 4:9
ఒకరికొకరు ఏకమనసు కలిగి ఉండాలి - అపొ.కా. 4:24,33

లోపలి పేజీల్లో...

- 'సాటి' నా? 'పోటీ' నా? - 2
- ఒకరినొకరు - 3
- కుటుంబాలు - కృపామయుని కలల సాధనాలు - 4
- సంసారం సంతోషంగా సాగాలంటే? - 5
- సంసారంలో సాధక బాధలు - 9
- మన పిల్లలు ఎదగాలి - 11
- కుటుంబంలో ఐక్యత - 16
- క్షమాపణకు 10 మార్గాలు - 17
- కుటుంబంలో కష్టాలు - 22
- పరీక్షలకు సిద్ధమేనా? - 25
- ఈ రూబీ జూబ్లీ వేళ... - 28
- తలవంచాలి - 29
- ఏమైందో నీ కుటుంబానికి - 31
- స్పర్థ - 32

కుటుంబాలు

కృపామయుని కలల సాధనాలు

"కుటుంబాలు కృపామయుని కరుణను చూపించగలవు.
కుటుంబాలు కర్కోటకుల్ని, కిరాతకుల్ని కీర్తి ప్రతిష్టలు గల వ్యక్తులుగా, క్రీస్తుకు ప్రతి బింబాలుగా
తీర్చిదిద్దగలవు. కరుణామయుడు కృప చూపిస్తే కుటుంబాలు ఏమైనా చేయగలవు".

యుఇయస్ఐ-ఏపి పరిచర్య 40 వసంతాల వికేంద్రీకరణ సందర్భంగా రూబీ జూబ్లీ సెలబ్రేషన్స్ జరుపుకున్న మనం మరింత ప్రోత్సాహంతో, ప్రహర్షంతో, ప్రతిజ్ఞతో ప్రభువుకు ప్రీతికరంగా కొనసాగాలి. దీనికోసం దేవుడు మనకిచ్చిన గొప్ప వరం మన కుటుంబాలే.

సాధారణ విద్యార్థులను సత్యవంతునికి పరిచయం చేసి, తమలో సంపూర్ణమైన మార్పుకి, సార్వభౌముని సాధనాలుగా మలిచేవి మన కుటుంబాలే.

యుఇయస్ఐ పరిచర్య ఓపెన్‌హోమ్స్‌లో జన్మించిందని మనం కథలు, కథలుగా చెప్పుకొంటున్నాం. దీన్ని మరోసారి జ్ఞాపకం చేసుకొని, మన పితరులు, ప్రస్తుతం సజీవ సాక్షులుగా ఉండే ఆదర్శప్రాయమైన కుటుంబాలను చూసి సమర్పించుకొనే తరుణమే ఈ సెలబ్రేషన్స్‌కి అర్థవంతమైన, అద్వితీయుడు ఆశించే కొనసాగింపు.

అకుల ప్రిస్కిల్ల అనేకమందికి, అన్యజనులలోని సంఘాల వారికి ఆప్యాయతను, అనురాగాన్ని చూపిన దంపతులుగా ఉన్నారు. అంతమాత్రమే కాకుండా పౌలులాంటి సేవకులకు ప్రాణాలు ఇవ్వడానికి తెగించినవారు. వారి పేరు గొప్పగా ఉండాలని గాని, స్వంత ఉద్దేశాలు నెరవేర్చుకోవాలని గాని వారు తెగించలేదు. ప్రభువు పరిచర్యకు సహకరించాలని తెగువ చూపించారు. పౌలు అంతటి వ్యక్తి వారి గూర్చి అంత మంచి సాక్ష్యాన్ని ఇచ్చాడంటే తప్పకుండా వాళ్ళు ప్రభావవంతమైన జీవితాన్ని జీవించి, చరిత్రలో నిలిచిపోయారు. అపొల్లో లాంటి విద్వాంసున్ని చేరదీసి వివేకాన్ని నింపిన దంపతులు వీరు. వీరి లాంటి కొన్ని కుటుంబాలుండడం వల్లే మీరూ, నేనూ ఈ పరిచర్యలో కొనసాగుతున్నాం. మన రాష్ట్రంలో ఉండే అన్ని కుటుంబాలు ఇలా ఉంటే ఎంత బాగుణ్ణు! ఎంతోమంది తమ్ముళ్ళు, చెల్లెళ్ళు ప్రభువుకి ప్రతినిధులుగా తయారవుతారు. ఈ దంపతుల పిల్లల వివరాలు మనకు తెలియదు గానీ, పరిచయమైన ప్రతి ఒక్కరిని తమ పిల్లలుగా భావించడమే వీరి వృత్తి, ప్రవృత్తి. అందుకే కృపామయుని కలల సాధనాలుగా మిగిలిపోయారు.

"విజేతలెవ్వరూ మధ్యలో వదిలేయరు. మధ్యలో వదిలేసిన వారు విజేతలు కాలేరు" కాబట్టి విజేతలుగా కొంతకాలం కొనసాగిన మనం, నూతనోత్సాహంతో మళ్ళీ ప్రారంభిద్దాం. కుటుంబాలను ప్రోత్సహిద్దాం. అప్పుడు అవివాహితులు కూడా తమ వివాహం తర్వాత, ఇప్పటికే వివాహితులైన వారు కూడా అకుల ప్రిస్కిల్లాల వలె, మన పితరుల కుటుంబాల వలె జీవించడానికి ప్రతిజ్ఞ పూనుతారు. అదే కదా మన రూబీ జూబ్లీ సెలబ్రేషన్స్‌కు అర్థవంతమైన, అద్వితీయుడు ఆశించిన కొనసాగింపు.

"కరుణామయుడు కృప చూపిస్తే కుటుంబాలు ఏమైనా చేయగలవు"

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు

కవర్ కథనం

సంసారం సంతోషంగా సాగాలంటే?

మానవ సంబంధాలన్నిటిలో అత్యంత సన్నిహితమైన బంధం వివాహబంధం. దీని ద్వారా భార్యాభర్తలు సంతోషాన్ని, సంతృప్తిని, సమాధానాన్ని తమ కుటుంబ జీవితంలో అనుభవించాలని దేవుడు ఇష్టపడుతున్నాడు. అంతేకాదు క్రైస్తవ కుటుంబమంత అందమైనది భూమ్మీద మరొకటి లేదు. దేవుడు ఏర్పరచిన వివాహవ్యవస్థ మనకు అన్ని విషయాల్లో చక్కని ఆదర్శం. ఇటువంటి సంబంధాన్ని దేవుడు ఇలా వివరించాడు "కాబట్టి పురుషుడు తన తండ్రిని తన తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును వారు ఏకశరీరమైయుందురు" (ఆది 2:24) బైబిల్లో నాలుగుసార్లు వివాహం గురించి చెప్పిన మాట ఇదొక్కటే. మొదటిగా ఆదికాండం రెండవ అధ్యాయంలో ఇది మనకు కనబడుతుంది. అక్కడ అది సృష్టికథను సంక్షిప్త పరుస్తుంది. తర్వాత విడాకుల గురించి యేసును ప్రశ్నించిన సందర్భాల్లో మత్తయి 19:5, మార్కు 10:7లో ఆయన దీన్ని ఉదహరిస్తాడు. చివరిగా ఎఫెసీ 5:31లో అపోస్తలుడైన పౌలు, క్రీస్తుకు, సంఘానికి గల సంబంధం విషయంలో వివరిస్తాడు.

నిజమైన వివాహబంధానికి అవసరమైన ఈ నియమంలో మూడు ఆజ్ఞలున్నాయి. విడిచిపెట్టడం, హత్తుకోవడం, ఏకశరీరమవ్వడం. మానవ చరిత్ర ఆరంభంలో దేవాది దేవుడు వివాహ వ్యవస్థను ఆశీర్వదించి, అభిషేకించిన సందర్భంలో ఈ మూడు ఆజ్ఞల నియమాన్ని ఇచ్చాడు. విజయవంతమైన ప్రతి వివాహానికి ఇది గీటురాయి వంటిది.

వివాహబంధంపై భార్యాభర్తలు కలిగి ఉండే దృక్పథం వారు పెరిగిన వాతావరణం, పెంపకం, సాంస్కృతిక నేపథ్యం, తల్లిదండ్రుల నమ్మకాలు మొదలైన అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఆదికాండం 2:24లో వివరించిన దేవుని సత్యాన్ని భార్యాభర్తలు అవలంభించి, అన్వయించుకోవాలని దేవుడు కోరుతున్నాడు. వీరికి స్వప్రయత్నంతో కూడిన సంకల్పం ఉండాలి. గతంలో నేర్చుకున్న ఆలోచనలకు, నమ్మకాలకు స్వస్తి చెప్పడానికి ఇష్టపడాలి. ఇద్దరు విభిన్న వ్యక్తులు ఏకశరీరంగా లేదా ఒకే వ్యక్తిగా ఎలా మారగలరు? దాని రహస్యం దేవునిలోనే ఉంది. యేసుక్రీస్తు ప్రభువునందు విశ్వాసముంచి ఆయన మాటకు విధేయత చూపడం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది. భార్యాభర్తలిరువురు ఏకశరీరమయ్యే ప్రక్రియను అనేకమార్లు తమ చర్యలతో చెడగొట్టుకుంటారు. మనం సంపూర్ణంగా ఆయన చిత్తానికి లోబడి, సమర్పించుకుంటేనే వివాహబంధంలో ఒకే శరీరమవ్వడం సాధ్యమవుతుంది.

1. విడిచి పెట్టడం

వివాహం విడిచి పెట్టడంతో ఆరంభమవుతుందని మనం అర్థం చేసుకోవాలి. ఇది వివాహాన్ని ఆచరించడానికి బహిరంగంగా, న్యాయబద్ధంగా జరగాల్సిన పనిని సూచిస్తుంది. భార్యాభర్తలు తమ సమీప కుటుంబాలను విడిచిపెట్టి ఆ దినం నుండి వారు తమ స్వంత కుటుంబాన్ని ఆరంభిస్తారు. భార్యాభర్తలు శారీరకంగా మాత్రమే కాక మానసికంగా, భావోద్రేకంగా, ఆర్థికంగా తమ వారి

ని విడిచి పెట్టాలి. తమ స్వంత నూతన కుటుంబం ఏర్పడినందున, గతంలో వారు జీవించిన అధికారం నుండి, పోషణ నుండి బయటకు రావాలి.

విడిచి పెట్టడమంటే తల్లిదండ్రులను విస్మరించి, నిర్లక్ష్యం చేసి, వారి పట్ల శ్రద్ధను కనబరచకపోవడం కాదు. తల్లిదండ్రులను సన్మానించి, విధేయత చూపాలని కోరే దేవుడు వారి బాగోగులు చూడవద్దని ఎందుకు చెబుతాడు? భార్యాభర్తలిరువురూ తమ తల్లిదండ్రులతో పరిపక్వత గల బంధాలను కలిగి ఉండాలి. ఇది సంతోషానికి చెల్లించాల్సిన వెల. ఇది స్పష్టంగా, స్వచ్ఛంగా ఉండాలి. బిడ్డ పుట్టినప్పుడు పేగు కోయకపోతే ఎలా ఎదగడో అలాగే నిజమైన విడిచిపెట్టడం, స్పష్టమైన విడిపోవడం జరగనంత కాలం వివాహం వృద్ధి చెందదు. ఇద్దరూ విడిచి పెట్టాలి. భార్యే కాదు భర్త కూడా.

భార్యాభర్తలిరువురూ ఒకరి అభిప్రాయాలకు, ఉద్దేశాలకు, అలవాట్లకు, నమ్మకాలకు ఇంకొకరు ప్రాధాన్యం ఇవ్వాలి. తల్లిదండ్రుల ఆమోదం, ఆప్యాయత, సహాయం, సలహాల కొరకు భార్యాభర్తలు గుడ్డిగా ఆధారపడకూడదు. ఒకరిపట్ల ఒకరు అంకిత భావంతో, నమ్మకత్వంగా వ్యవహరించాలి.

శారీరకంగా విడిచిపెట్టడం జరిగినా అనేకమార్లు భార్యాభర్తలు వారి తల్లిదండ్రులను మానసికంగా, భావోద్రేకంగా ఆర్థికంగా విడిచి పెట్టడం జరగడం లేదు. భార్యాభర్తల మధ్య జరిగే ప్రతీ సంభాషణను భార్య తన తల్లిదండ్రులకు చేరవేస్తుంది. "కుమారీ ఆలకించుము, ఆలోచించి చెవి యొగ్గుము, నీ స్వజనమును నీతండ్రి ఇంటిని మరువుము" (కీర్తన 45:10) వాక్యం స్పష్టంగా భార్యలను హెచ్చరిస్తుంది.

తల్లిదండ్రులను సంతోష పెట్టడానికి భర్తలు వాక్యానుసారంగాని ఆచారాలను, నమ్మకాలను తన కుటుంబంలో చేయడానికి ప్రయత్నిస్తారు (1 పేతురు 1:18). తమ తల్లిదండ్రులకు అనుగుణంగా బాహ్య ప్రవర్తనను, అలవాట్లను మార్చడానికి ప్రయత్నిస్తారు. వివాహం అనంతరం కూడా అనేకమంది భార్యాభర్తలు ఆర్థికంగా తల్లిదండ్రుల మీద ఆధారపడతారు. భార్యాభర్తలు తమ ప్రమేయం, ఇష్టం లేకుండానే ఎవరికి వారే తమ తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం చేయడానికి ప్రయత్నిస్తారు. ఇటువంటి పరిస్థితులు కుటుంబంపై, భార్యాభర్తల బంధంపై తీవ్ర ఒత్తిడిని కలుగజేస్తాయి.

భార్యాభర్తలు, తమ సమీప కుటుంబాన్ని వాక్యానుసారంగా విడిచిపెట్టకపోతే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. భాగస్వామి తన తల్లిదండ్రుల గృహంలో ఆదరణను, భద్రతను వెదికితే వారి వివాహ జీవితంలో సుఖశాంతులుండవు. వివాహం తరువాత భర్త తల్లిదండ్రుల అధికారంలో భావోద్రేకాలతో వ్యవహరిస్తే కుటుంబానికి అవసరమైన నాయకత్వాన్ని ఇవ్వలేడు.

విడిచిపెట్టడం బహిరంగంగా చేసే క్రియ. ఇది బాధాకరమైంది. ఆరంభంలో కొంత అపార్థానికి దారి తీసినా సరే, భార్యాభర్తలు తమ వివాహ బంధాన్ని కాపాడుకోవడానికి తప్పనిసరిగా చేయవలసిన చర్య. లేకపోతే ఇతరుల జోక్యం వలన కుటుంబం కలతలకు లోనవుతుంది. భార్యాభర్తలు తమ సొంత ఇష్టాలను, నిర్ణయాలను నెరవేర్చుకోవడానికి విడిచి పెట్టడం ఎంతైనా అవసరం.

అయితే కొన్నిసార్లు తల్లిదండ్రులను శారీరకంగా విడిచిపెట్టే పరిస్థితి సాధ్యం కాకపోవచ్చును. వృద్ధులైన తల్లి లేక తండ్రికి బిడ్డల మీద ఆధారపడే పరిస్థితి ఉంటుంది. అటువంటి సమయంలో మానసిక, భావోద్రేకపరమైన విడిచి పెట్టడం తప్పనిసరి. తల్లిదండ్రులు పిల్లల అభివృద్ధి, క్షేమాల కొరకు ఎంతో కృషి చేస్తారు. పిల్లలు వారి యెడల కృతజ్ఞత కలిగి శ్రద్ధ చూపాలి. అదే సమయంలో వారి జోక్యం నుండి కుటుంబాన్ని కాపాడుకోవాలి. ఈ జోక్యాన్ని భార్యాభర్తలిరువురూ కలిసి ఎదుర్కోవాలి. దీనిలో సున్నితంగా, ఖచ్చితంగా వ్యవహరించాలి.

వివాహంలోని ఏకాంతాన్ని కాపాడుకోవాలి. వారిద్దరి సంబంధం, దేవునితో గల సంబంధం తరువాత ప్రాధాన్యం కావాలి.

అదే సమయంలో తల్లిదండ్రులు పిల్లలకు స్వేచ్ఛనిచ్చి పరిపక్వతలోకి ఎదగనివ్వాలి. కేంద్రక (న్యూక్లియర్) కుటుంబం ఆరోగ్యంగా, పటిష్టంగా వృద్ధి చెందిన నాడు సమిష్టి కుటుంబం చక్కగా పని చేయడానికి వీలవుతుంది. భార్యాభర్తలిరువురూ మానసిక అవసరతలు ఇరువురి నొద్దనుండే పొందాలి తప్ప ఇతరుల నుండి కాదు.

2. హత్తుకోవడం

ఇద్దరూ విడిచి పెట్టినట్లుగానే ఇద్దరూ హత్తుకోవాలి. భర్త భార్యను బైబిలు చెబుతున్నట్లు హత్తుకోవాలి. అయితే దీనర్ధం తల్లిదండ్రులను విస్మరించి వారితో ఎలాంటి సమయాన్ని గడపక పోవడం కాదు.

విడిచి పెట్టడానికి, హత్తుకోవడానికి అవినాభావ సంబంధముంది. విడిచి పెట్టడమనేది బహిరంగ మైనది, న్యాయపరమైనది. హత్తుకోవడం వ్యక్తిగత మైంది. నీవు విడిచి పెట్టకుండా హత్తుకోలేవు. అవి ఒకదానికొకటి పెనవేసుకొని ఉన్నాయి. హత్తుకోవాలని నిర్ణయించుకోకుండా నీవు విడిచి పెట్టలేవు. హత్తుకోవడం అనే మాటకు హెబ్రీ భాషలో ఒక వ్యక్తికి 'అతుక్కోవడం' 'అతికించడం' 'అంటిపెట్టుకోవడం' అని అర్థం. రెండు కాగితపు ముక్కల్ని విడదీయాలని నీవు ప్రయత్నిస్తే రెండూ చిరిగిపోతాయి. హత్తుకున్న భార్యాభర్తల్ని ఎవరు విడదీయాలని ప్రయత్నించినా, భార్యాభర్తలిరువురూ బాధపడతారు.

ఈ హత్తుకోవడం ద్వారా భార్యాభర్తలు అత్యంత సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉంటారు. ప్రపంచంలో ఇటువంటి సంబంధం మరెవరిలో ఉండదు. మన ఉద్యోగం, స్నేహితులు, పరిచర్య, ఇంటి శుభ్రం, అతిథులు, పిల్లలు మొదలైన వాటన్నిటి కంటే ఈ హత్తుకోవడం ప్రాముఖ్యం. అంటే భార్యాభర్తలు ఒకరికొకరు, అత్యంత ప్రాధాన్యం ఇచ్చుకుంటారు. ఇది భావోద్రేకాలు, ఆకర్షణ మీద ఆధారపడి లేదు గాని ఒకరిపట్ల ఒకరు కలిగిన నిబద్ధత మీదనే ఆధారపడి ఉంది. ఇద్దరూ కలసి సంతోష, దు:ఖాలను పంచుకుంటారు. ఒకరిపట్ల ఒకరు షరతులు లేకుండా, అన్ని పరిస్థితులలో నమ్మకత్వంతో జీవిస్తారు. ఒకరినొకరు విమర్శించుకోరు. "విమర్శ కుటుంబంలోని చక్కని సంబంధాలకు గొడ్డలిపెట్టు లాంటిది".

ఇద్దరి మధ్యగల సాన్నిహిత్యాన్ని స్వప్రయత్నంతో వృద్ధి చేసుకోవడానికి ఎవరికి వారే కృషి చేయాలి. ఆ సంబంధాన్ని పోషించుకుంటూ కాపాడుకోవాలి. దీనికే అత్యంత విలువనివ్వాలి. జీవితంలో ఎన్నడూ ఈ సన్నిహిత అనుభవాన్ని వదిలి పెట్టకూడదు. ఇటువంటి సాన్నిహిత్యం భార్యాభర్తలను ఒంటరితనం, ఏకాంతం నుండి దూరం చేస్తుంది. ఇద్దరూ అంకితభావంతో ఒకే లక్ష్యాన్ని చేరుకోవడానికి ముందుకు సాగాలి. భాగస్వామికి ఏ పరిస్థితులలో

హత్తుకోవడం అనే మాటకు హెబ్రీ భాషలో ఒక వ్యక్తికి 'అతుక్కోవడం' 'అతికించడం' 'అంటిపెట్టుకోవడం' అని అర్థం. రెండు కాగితపు ముక్కల్ని విడదీయాలని నీవు ప్రయత్నిస్తే రెండూ చిరిగిపోతాయి. హత్తుకున్న భార్యాభర్తల్ని ఎవరు విడదీయాలని ప్రయత్నించినా, భార్యభర్తలిరువురూ బాధపడతారు.

విఫలం చేయనటువంటి నమ్మకత్వం కనబరచాలి. ఇది శాశ్వతమైనదిగా ఉండాలి.

భార్యాభర్తలలో ఈ హత్తుకోవడం వంటి సాన్నిహిత్యం కొరవడితే వ్యభిచారానికి తావు ఏర్పడు తుంది. విడాకులు తీసుకోవాలనే ఆలోచన విశ్వాసుల మనస్సుల్లోకి ఎటువంటి పరిస్థితుల్లోనూ రాకూడదు. దేవుడు విడాకులను అసహ్యించుకుంటాడు (మలాకి 2:16). దీనిలో వెల చెల్లించవలసిన విషయం ఒకరినొకరు క్షమించుకోవాలి (ఎఫెసీ 4:32). భాగస్వాములలో ఒకరు పడిపోతే ఆ వివాహబంధాన్ని స్వస్థపరిచేది క్రైస్తవ క్షమాపణ. "క్షమించుకోవడం అనుదినం కుటుంబ జీవితంలో జరగవలసిన క్రియ".

3. ఏకశరీరమవ్వడం

విడిచిపెట్టడం, హత్తుకోవాలనే ఆజ్ఞలకు విధేయత చూపడం ద్వారా, భార్యాభర్తలు ఏకశరీరమవ్వడానికి సంసిద్ధులౌతారు. ఈ రెండూ నేర్చుకున్నప్పుడే, ఏకశరీరమవ్వడం నేర్చుకుంటారు. ఇది వివాహం అనంతరం, భార్యాభర్తలలో క్రమక్రమంగా, నిదానంగా జరిగే ప్రక్రియ. ఇది ఈ భార్యాభర్తల మధ్య జరిగే శారీర కలయికకు సంబంధించినదే కాదు, అంతకుమించినది. భార్యాభర్తలిరువురూ వారికున్న సమస్తాన్ని పంచుకోవడం - వారి

శరీరాలు మాత్రమే కాదు, వారి వస్తువులే కాదు వారి ఆలోచనలు, వారి భావాలు, వారి సంతోషం, వారి దు:ఖం, వారి శ్రమ, వారి ఆశలూ, వారి భయాలూ, వారి విజయాలు మరియు వారి అపజయాలు. 'ఒక్క శరీరమవ్వడం' అంటే ఇద్దరు వ్యక్తులు శరీరంతో, ప్రాణంతో, ఆత్మతో పూర్తిగా ఏకమవ్వడం.

ఇద్దరు అసంపూర్ణ వ్యక్తులు ఒక్క శరీరమవ్వడం కాదు, ఇద్దరు పరిపూర్ణ వ్యక్తులు సమగ్రంగా నూతన సంపూర్ణ వ్యక్తిగా అవడం.

వివాహంలో ఏకశరీరమవ్వడం అనే ప్రక్రియలో భార్యాభర్తలిరువురూ శారీరకంగా ఒకటవ్వడం అనే అర్థం కూడా ఇమిడి ఉంది. రెండు శరీరాలు కలసి ఒక్కటైనప్పుడు, వారు దాని ద్వారా ప్రేమను, ఒకరి యెడల ఒకరు కలిగిన నమ్మకత్వాన్ని, నిబద్ధతను వ్యక్తపరుచుకుంటారు. దీని ద్వారా 'ఒకే శరీరమవ్వడం' అనే అనుభవాన్ని పోషించి, వృద్ధి పరచుకుంటారు.

'ఏకశరీరమవడంలో' భార్యాభర్తలిరువురూ అత్యంత సన్నిహిత సంబంధాన్ని పెంపొందించుకుంటారు. ఒకరికొకరు సహకరించుకుంటూ ఒకరి హావ భావాలకు మరొకరు అనుగుణంగా ప్రవర్తిస్తారు.

సంబంధ బాంధవ్యం నిరంతరం కొనసాగుతుంది. ఇది శాశ్వతమైంది. "దేవుడు జతపరచిన వారిని మనుష్యుడు వేరుపరచకూడదు" (మార్కు 10:9).

భాగస్వామి అంటే మరొకరితో పంచుకునే వ్యక్తి అని అర్థం. ఒక పనిని నిర్వర్తించి, నెరవేర్చడానికి ఇద్దరు లేక ఎక్కువ మంది వ్యక్తులు కలిగి ఉండే సహవాసాన్ని భాగస్వామ్యం అంటాం.

వివాహంలో భార్యాభర్తలిరువురూ ఏక శరీరమవ్వడం దేవుని ఉద్దేశం. అందుచేత తమ సంబంధంలోనికి చొచ్చుకొని వచ్చే ప్రతీ దాని నుండి భార్యాభర్తలు కాపాడుకోవాలి. అది వస్తువు కావచ్చు, వ్యక్తి కావచ్చు. ఏక శరీరమయ్యే ప్రక్రియకు విఘాతం కలిగించే ఏదైనా వివాహంలో భార్యాభర్తలు శ్రేష్ఠతను అనుభవించకుండా అవరోధిస్తుంది.

ఏకశరీరమవ్వడం యాంత్రికంగా జరిగేది కాదు. అందుచేత ఇద్దరూ దీనిని చేరడానికి నిరంతరం, చురుకుగా, జ్ఞానయుక్తంగా యత్నం చేయాలి. దీనిలో ప్రేమించడం, అర్థం చేసుకోవడం, వినడం, ఇవ్వడం, సర్దుకోవడం, త్యాగం చేసుకోవడం, పంచుకోవడం, దాపరికం లేకుండా జీవించడం మొదలైనవి ఇమిడి ఉన్నాయి.

భార్యాభర్తలిరువురూ వారి కుటుంబానికి సంబంధించిన అన్ని విషయాల్లో ఏకత్వం కలిగి ఉండాలి. ఇంటి బడ్జెట్ వేసుకోవడంలో, పిల్లల పెంపకం, అత్తమామలతో గల సంబంధాలు, జీవనశైలి, ఏ సంఘానికి హాజరవ్వాలి, ఆతిథ్యం, పరిచర్య మొదలైన విషయాలలో ఏకభావం, ఏకమనస్సు ఉండాలి. పరిశుద్ధాత్మని సహాయం లేకుండా దీనిని అభ్యసించడం అసాధ్యం. దీనిలో అనేక విధాలుగా సర్దుబాటు చేసుకోవాలి. ఇటువంటి ఏకత్వం ఉన్నప్పుడే శారీరకంగా, మానసికంగా ఒకరి ఎదుట ఒకరు ఎలాంటి దాపరికాలు లేకుండా జీవించగలం. అప్పుడే మన జీవితాలలో స్వచ్ఛత, చిత్తశుద్ధి వ్యక్తపరచడానికి అనుకూలమవుతుంది. ఎటువంటి భయం, బెదురు లేకుండా భార్యాభర్తలిరువురూ పరస్పరం నమ్మకంతో, విశ్వాసంతో ఒకరి మీద ఒకరు ఆధారపడుతూ జీవించగలరు.

ఏకశరీరమవ్వడానికి ఎదురయ్యే ఆటంకాలు

1. ఏకాంతంగా గడపడానికి వీలుకాని పరిస్థితులు
2. ఒకరినొకరు అంగీకరించుకోకపోవడం, ఆధారపడక పోవడం
3. ఒకరితో ఒకరు సమయం గడపకపోవడం.
4. సెక్స్ జీవితంలో సమస్యలు
5. భార్య ఆత్మన్యూనతతో బాధపడడం
6. పురుషాధిపత్యం, అహంకారం
7. మారడానికి ఇష్టం చూపకపోవడం
8. ఒకరు చెప్పేది మరొకరు వినకపోవడం (1 పేతు 3:1-7)

సంతోషకరమైన వివాహ జీవితానికి విడిచిపెట్టడం, హత్తుకోవడం, ఏకశరీరమవ్వడం ఎంతో అవసరం. త్రికోణంలో ఒక కోణం లేకపోతే అది ఎలా త్రికోణం కాకుండా పోతుందో వివాహంలో కూడా ఈ మూడు భాగాలలో ఏది లేకపోయినా అది వివాహం కాదు. ఇవి ఒకదానికొకటి విడదీయలేనివి.

– కె. దేవిడ్ రాజ్ కుమార్, గుంటూరు

సంసారంలో సాధక బాధలు

"ఎవడైనను తనకు హాని చేసెనని ఒకడనుకొనినయెడల ఒకనినొకడు సహించుచు ఒకనినొకడు క్షమించుడి. ప్రభువు మిమ్మును క్షమించులాగున మీరును క్షమించుడి (కొల 3:13). వివాహ జీవితాలలో కలహాలు ఎందుకు వస్తాయి? వివాహంలో రెండు విభిన్న వ్యక్తిత్వాలు, మనోభావాలు కలిగిన వ్యక్తులు జత చేయబడతారు కాబట్టి విభేదాలు ఉంటాయి. చాలా మంచి కుటుంబాలలో కూడా ఈ విభేదాలు సంభవిస్తుంటాయి. ఇది దేవుని వాక్యంలోనే మనం చూడవచ్చు. విభేదాలు వివాహానికి అంతం కావు గాని వైవాహిక సంబంధంలో ఎదుగుదలకు, అభివృద్ధికి సహాయకరం. ఇవి మనలోని బలహీనతలను మనకు చూపించి నేర్చుకోవడానికి సహాయం చేస్తాయి. ఈ విభేదాలు, కలతలు తీరిపోయినప్పుడు వాటి ఫలితంగా వచ్చే అభివృద్ధి చాలా ఎక్కువ. కాబట్టి ఈ విభేదాలను మనలను పాడుచేసే విషయాలుగా కాక, బలపరిచే సంగతులుగా చూడడం నేర్చుకోవాలి.

కలహాలకు కారణాలు

అత్తమామలు, వ్యక్తిగత పాపం, డబ్బు ఖర్చు పెట్టడం, ఆత్మీయ ప్రమాణాలు, విలువలు, ఒకరిపట్ల ఒకరికి గౌరవం లేకపోవడం, ఒకరితో ఒకరు సరిగా మాట్లాడుకోకపోవడం, లైంగిక అసంతృప్తి, తమ పాత్రలను సరిగా అర్థం చేసుకోకపోవడం, ఉద్యోగంలో ఒత్తిళ్ళు, రుచులు, అలవాట్లు, వ్యక్తిగత ధోరణి, అహంకారం, స్వంత నిర్ణయాలు, పిల్లలను పెంచడం, కోపం, క్షమించలేని గుణం మొదలగునవి కలహాలకు కారణాలవుతాయి.

కలహాలు వచ్చినప్పుడు ఏమి జరుగుతుంది?

పురుషులలో వారి అహం దెబ్బ తింటుంది. స్త్రీలలో అభద్రతా భావాలు కలుగుతాయి. తృణీకరించబడిన భావన, కోపం, ద్వేషం, కన్నీరు, తమపై తమకే జాలి, ఆకలి లేకపోవడం, నిద్ర రాకపోవడం, తలనొప్పి, శరీరంలో బలహీనత, ముడుచుకొని పోవడం, ఒంటరితనం, మరణాన్ని గురించిన తలంపులు,

ప్రతీకార వాంఛ మొదలైన భావనలు కలుగుతాయి. మనం మన పాతస్వభావానికి లోబడితే (యాకో 4:2) కలహాలు వస్తాయి. సాతాను కూడా వాటిని మనకు కలుగజేస్తాడు. ఆశ్చర్యకరమైన విషయమేంటంటే, ఈ కలహాలు మనం అనుకోని సందర్భాలలో, స్థలాలలో, సమయాల్లో, మరి ముఖ్యంగా సంతోష సమయాల్లో వస్తుంటాయి. అందుచేత మనం ఎప్పుడూ మెలకువగా ఉండాలి.

విభేదాలు వచ్చినప్పుడు స్పందించే తీరు?

1. కొంతమంది తాము గెలవలేమని తలచి తమలో తాము ముడుచుకొనిపోయి ఆ పరిస్థితి నుండి దూరంగా వెళ్ళిపోతారు. అంటే వీళ్ళకు సంబంధం గాని, అభివృద్ధి గాని పట్టవు. ఇది మంచిది కాదు.
2. కొందరైతే ఎలా అయినాసరే ఆ పరిస్థితిలో గెలిచి తీరాలనుకుంటారు. వీరి ఆరాటం ఏంటంటే వాదంలో నెగ్గడమే. వీరికి సంబంధంతో పనిలేదు. ఇది కూడా మన జీవితాలకు పనికిరాదు.
3. మరికొందరు లోబడిపోతారు. సంబంధాన్ని కాపాడుకోవాలన్న తలంపుతో వాళ్ళ అభిప్రాయాలను అణచుకొని తమ జీవిత భాగస్వామితో ఏదోరకంగా సాగిపోవాలనుకుంటారు. ఇది సరి కాదు.
4. మరికొంతమంది ఒక సర్దుబాటు చేసుకొని కొన్ని నేను చెప్పినట్లు చేస్తే కొన్ని నీవు చెప్పినట్లు చేస్తానని ఒక రాజీకి వస్తారు. వీరికి సంబంధం ముఖ్యమే కాని వివాహంలో సరైన అవగాహన ఉన్నవారు కాదు. ఇదీ మంచిది కాదు.

5. చివరిగా కొందరు, సమస్యను చర్చించి, అర్థం చేసుకొని, ఉభయుల సమ్మతితో ఒక పరిష్కార మార్గాన్ని కనుగొంటారు. వీరికి వివాహ సంబంధం చాలా విలువైనది. ఈ పద్ధతి చాలా మంచిది.

విభేదాల పరిష్కారంలో గమనించాల్సిన విషయాలు?

1. ఎట్టి పరిస్థితులలోను 'విడాకులు' అన్న మాట రానీయకూడదు. మన మనసులలో కూడా దానికి స్థానాన్ని ఇవ్వకూడదు.
2. మనం స్పందించేటప్పుడు చాలా యధార్థంగా మోహమాటం లేకుండా ఉండాలి. మనలను ఏ విషయం బాధ పెట్టిందో తెలియచేయాలి.
3. మన కోపాన్ని అదుపులో ఉంచుకోవాలి. ఇది చాలా కష్టం. ఇది వ్యక్తుల మధ్య సంబంధాలను పాడు చేస్తుంది. ఎఫెసీ 4:26,31లో కోపంలో పాపం చేయవద్దనీ, దాన్ని తీసివేసుకోవాలనీ చెప్పబడింది. కోపంలో స్వార్థం ఉంటుంది. మనం కోపంగా ఉన్నామని మన భార్య/ భర్తకు చెప్పాలి. అసలా కోపానికి కారణం ఏమిటో తెలుసుకోవాలి. మన కోపాన్ని ప్రభువు ముందు ఒప్పుకొని, మన మాటల ద్వారా, పనుల ద్వారా, ముఖ కవళికల ద్వారా మన భార్య/భర్తకు హాని కలిగించకుండా ఉండడానికి సహాయం కోసం అడగాలి.
4. మన మాటల విషయంలో బహు జాగ్రత్తగా ఉండాలి. అవమానకరమైన మాటలు, వికృతమైన విమర్శ ఉండకూడదు. మాటలు మారణాయుధాలు కాగలవు. "నీవెప్పుడూ అంతే" లేక "నీవేనాడూ చెయ్యవు" అన్న మాటలు మనం పూర్తిగా విడిచి పెట్టాలి.
5. మన స్వరాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. ఎంత గట్టిగా మాట్లాడితే అంత కొంచెం వినబడుతుంది. స్వర స్థాయి మృదువుగా ఉంటే కలహం తొందరగా సమసి పోవడానికి వీలవుతుంది. వేరే వారికి గాయం కూడా కాదు.
6. కలహం తీర్చుకోవడం మీద మన మనస్సుండాలి గాని ఒకరినొకరు సాధించుకోవడానికి కాదు.
7. 'నువ్వు' అనే దానికి బదులుగా 'నేను' అన్న మాటలను వాడితే అవతలి వ్యక్తి తన్నుతాను రక్షించుకోడానికి ప్రయత్నించరు. 'నువ్వు' అంటే నింద మోపినట్లుగా ఉంటుంది. నీకేమైందో చెప్పాలి గాని నిందించకూడదు.
8. కలహం ఆరంభం అవ్వగానే, సాధ్యమైనంత తొందరగా దాన్ని సంధించడం మంచిది (ఎఫె 4:26). రాత్రి పడకకు చేరుకొనే లోపే మన విభేదాలు తీరి పోవాలి.
9. సమస్యలను తీర్చుకోడానికి ఇరువురికీ సమ్మతమైన సమయం, స్థలం చూచుకొని ఎవరూ మనకు మధ్యలో అంతరాయం కలిగించకుండా చూసుకొని నిధానంగా సమస్యను తీర్చుకోవాలి. ఇది పిల్లలు చూసి నేర్చుకుంటారు.
10. మనం చేసింది తప్పని తెలియగానే దాన్ని ఒప్పుకోవడానికి ఆలస్యం చేయకూడదు. దీనికి చాలా దీనత్వం అవసరమౌతుంది. క్షమాపణ అడగాలి.
11. సమస్య మీద కాకుండా, వాటికి సమాధానాల మీద మనం మనస్సుంచాలి. ఇరువురికీ సమ్మతమైన మార్గాన్ని తెలుసుకొని దాన్ని అనుసరించడం మంచిది.
12. ప్రతిసారీ కూడా మంచి క్షమాపణతో మన విభేదాలను ముగించాలి. క్షమించడంలో దేవుని శక్తి ఉంది (కొల 3:13). దేవుడు మనలను క్షమించినప్పుడు మనం కూడా క్షమించడానికి సిద్ధంగా ఉండాలి. క్షమాపణ అడగడం చాలా దీనత్వంతో కూడిన పని. క్షమించడం కూడా దీనత్వంతో చేసే పని. మనసుకు కలిగిన గాయాలు మాన్పేది కాలం కాదు క్షమాపణే.
13. మన కుటుంబ సమస్యలను అతి రహస్యంగా ఉంచాలి.
14. ప్రతిసారి కూడా మన సమస్యలను ప్రభువు దగ్గరకు ప్రార్థనలో ఇద్దరూ కలిసి తీసుకొని రావాలి.

కలహాలు వైవాహిక జీవితంలో వస్తూనే ఉంటాయి. వాటికి మనం భయపడనవసరం లేదు. నీరసించి పోనవసరం లేదు. మనకు మనస్సుంటే, మన సమస్యలకు జవాబులు దొరుకుతాయి.

– క్రిస్టియన్ హోమ్ డిపార్ట్మెంట్,
యుఇయస్ఐ–ఏపి

మన పిల్లలు ఎదగాలి

"మా అమ్మ నాన్న మాటలకు ఒక్క మాట కూడా ఎదురు చెప్పేవాళ్ళం కాదు. మీలా అయితే వాళ్ళు మమ్మల్ని పెంచలేకపోయేవారు" ఓ తల్లి వేదన.

"ఏడుగురు పిల్లల్ని ఎంత సులువుగా పెంచాము. ఇద్దర్ని కని పెంచలేక సతమతమయిపోతున్నారు" నాన్నమ్మ అభిప్రాయం.

"ఆ! ఇప్పుడు పిల్లలకు తెలియనిది ఏదీ లేదు. మనకంటె మూడు ఆకులు ఎక్కువే చదివారు" ఓ తండ్రి ఆక్రోశం.

ఇలాంటి స్టేట్‌మెంట్స్ తరచుగా వింటుంటాం. మీడియా నూతన పోకడల వలన, మారిన ఆలోచనా సరళి వలన ప్రస్తుతం పిల్లలు అవసరమైన సమాచారం కంటే అధికంగా ప్రభావితమవుతున్నారు. పిల్లల్ని పెంచడం ఒక విధంగా తల్లిదండ్రులకు ఒక భారంగా, సవాలుగా మారింది.

వివాహం, కుటుంబం దేవుని ప్రణాళికలో నుండి ఆవిర్భవించాయి. దీనికి ఆయనే పునాది, శిల్పి. స్త్రీ, పురుషులను ఆశీర్వదించి "మీరు ఫలించి, అభివృద్ధి పొంది, విస్తరించి, భూమిని నిండించి దానిని లోబరచుకొనండని" దేవుడు ఆదాము, హవ్వలకు ఆయన చిత్తాన్ని స్పష్టంగా తెల్పాడు. బిడ్డలను దేవుడు తల్లిదండ్రులకు బహుమానంగా, సొస్థ్యంగా, దానంగా ఇచ్చాడు. ''కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము, గర్భఫలము ఆయనిచ్చు బహుమానమే" కీర్త 127:3. తల్లిదండ్రులు వీరి పట్ల గృహనిర్వాహకులు, కావున వారు దేవునికే జవాబుదారులు. బిడ్డల పట్ల ఆరోగ్యకరమైన, మంచి దృక్పథం ప్రతి ఒక్కరు కలిగి ఉండాలి. అనేక మంది తల్లిదండ్రులు వారి పిల్లల విషయంలో అతిగా ప్రేమను పెంచుకుంటారు. కొన్నిసార్లు దేవుని కంటె అధికంగా వారిని ప్రేమిస్తారు. అత్యధికమైన శ్రద్ధ చూపుతారు. వారి పట్ల మన వైఖరి జాగ్రత్తగా ఉండాలి. "సమస్తమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయన ద్వారాను, ఆయన కొరకు సృజింపబడెను" అని కొలస్సీ 1:16 లో రాయబడింది.

దేవుని దగ్గర నుండి పొందిన ఈ బహుమానాలను ఆయన కోసం ఈ స్పీడ్ యుగంలో ఎలా పెంచాలో ఒక ప్రశ్నగా మారింది. మంచి వార్త! బహుమానాలను ఇచ్చిన దేవుడు వారినెలా పెంచాలో, దానిలో ఎలా సఫలీకృతులవ్వాలో, వాటికి అవసరమైన సూత్రాలను లేఖన భాగాల్లో విపులీకరించారు. బిడ్డల సంపూర్ణ ఎదుగుదలకు ప్రాముఖ్యతనివ్వాలి. దానికి మాదిరి యేసు ప్రభువే. ఆయన బాల్యం గురించి అంత ఎక్కువ సమాచారం వాక్యంలో లేకపోయినా చిన్ననాటి నుండి ఆయన సంపూర్ణ సమతుల్యత గల ఎదుగుదల కలవాడని వాక్యంలో రాశారు. "యేసు జ్ఞానమందును, వయస్సునందును, దేవుని

దయయందును, మనుష్యుల దయయందును వర్ధిల్లుచుండెను" లూకా 2:52. తమ పిల్లలు పరిపక్వత చెందిన మానవులుగా వృద్ధిచెందాలని ఆశించాలి, కాంక్షించాలి.

1. శారీరక ఎదుగుదల

దేవుడిచ్చిన ప్రతి బిడ్డ తల్లిదండ్రులకు అపురూపమైనవారే. ప్రతి బిడ్డ పట్ల దేవుని ప్రత్యేక ఉద్దేశం ప్రణాళిక ఉన్నాయి. "నీవు నన్ను కలుగచేసిన విధము చూడగా భయమును, ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి అందును బట్టి నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను" అంటాడు కీర్తనాకారుడు (కీర్తన 139:14). ప్రతి తల్లి తండ్రి నమ్మాల్సిన సత్యం ఇది. బాహ్య సౌందర్యానికి వెల కట్టే రోజుల్లో జీవిస్తున్నాం. బిడ్డ పుట్టినది మొదలు ఆడ, మగ, రంగు, తెలివి తేటలు, పోలిక, బరువు, ఎత్తు అన్నీ పరిగణలోకి తీసుకోబడుతున్నాయి. దేవుని పోలిక, స్వరూపం కలిగిన వారమని నమ్మే తల్లిదండ్రులు వారి పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆలోచనలను, నమ్మకాలను విత్తుతారు. దేవుడిచ్చిన విలక్షణతను ఆమోదించడం, వారి బలాలను, బలహీనతలను గుర్తించడం వారికి నేర్పాలి. వారిలోని యోగ్యతను మళ్ళీ మళ్ళీ ధృవీకరించాలి. వారి శారీరక ఎదుగుదలకు అవసరమైన, సమతుల్యతతో కూడిన ఆహారాన్ని సమకూర్చాలి. కొన్ని కుటుంబాలలో బాహ్య అలంకరణకు, బహుమానాలకు, ఆట బొమ్మలకు వెచ్చించినంత డబ్బును కనీసం పోషకాహారం పెట్టడానికి వినియోగించరు. అంతేగాక పిల్లల్ని ఇతరులతో పోల్చడం చాలా ప్రమాదకరం.

2. మేధస్సు సంబంధమైన ఎదుగుదల

పిల్లలు పుట్టకపోతే కావాలని ఒకటే ప్రార్థిస్తారు. గర్భం దాల్చాక అంగవైకల్యం లేకుండా ఆరోగ్యవంతమైన, అందమైన బిడ్డ కావాలని కోరుకుంటారు. పుట్టిన తరువాత చిన్నతనం నుండే గొప్ప మేధావైపోయి అన్ని రంగాలలో ఉన్నతంగా ఎదిగి, యల్‌కేజి నుండే ఫస్ట్ ర్యాంక్ రావాలని ఆశిస్తాం. అతి చిన్న వయస్సులోనే పిల్లలకు పోటీ ఆరంభమైపోతుంది. ప్రస్తుతం పిల్లలు తమ బాల్యదశను సంతోషంగా అనుభవించలేక పోతున్నారు. పోటీ అవసరమే కాని పిల్లల మీద విపరీతమైన ఒత్తిడి తెచ్చి, వారిని మానసిక ఆందోళనకు గురి చేసే పోటీ అనారోగ్యకరం. "మీరు ఈ లోక మర్యాదను అనుసరించవద్దు" అని లేఖన భాగాలు హెచ్చరిస్తున్నాయి. ఈ లోకపు మూసలోకి మనం వెళ్ళిపోకూడదు. అలాగని ఏదో విధంగా తృప్తిపడి, వారిని ప్రోత్సహించకూడదని కాదు.

"బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము. పెద్దవాడైనప్పుడు దాని నుండి తొలగిపోడు" సామె 22:6

విద్యలో, ఇతర నైపుణ్యాలతో పిల్లలు రాణించడానికి తల్లిదండ్రులు సహాయం చెయ్యాలి. ప్రాముఖ్యంగా చిన్నప్పుడే వారిలో గల ఆసక్తిని గమనించాలి. దానిని ప్రోత్సహించాలే తప్ప తల్లిదండ్రుల ఆశలు వారి మీద రుద్దడానికి ప్రయత్నం చేయకూడదు. ఆర్ట్స్ అయినా, సైన్స్ అయినా ఆ సబ్జెక్టులో వారు ప్రతిభావంతులుగా రాణించడానికి ప్రోద్భలమివ్వాలి. వారి సమర్థతకు మించి వారి నుండి ఆశించకూడదు. స్కూల్, కాలేజ్ సబ్జెక్ట్‌లకు సంబంధించిన సమాచారాన్ని చదవడమే కాక, పూర్ణ జ్ఞానాన్ని పెంపొందించే న్యూస్ పేపర్, ఇతర పుస్తకాలు చదవడాన్ని ప్రోత్సహించాలి. ప్రశ్నలు వేయడం, విషయాలను విశ్లేషించడం, అవగాహన పెంపొందించుకోవడం నేర్పాలి.

ప్రతి వ్యక్తిలో దేవుడిచ్చిన ప్రత్యేక సమర్థతలు, తలాంతులుంటాయి. వాటిని తల్లిదండ్రులు చిన్నప్పుడే గమనించి, పురిగొల్పి వాటికి అవసరమైన వనరులు సమకూర్చాలి. ఉదా: ఆర్ట్స్ వేయడం, ఇన్‌స్ట్రుమెంట్స్ ప్లే చేయడం వంటివి.

3. సామాజిక ఎదుగుదల

'కుటుంబం' భద్రత కల్పించే ఒక ఆశ్రయం లాటింది. కుటుంబంలో సభ్యులు ఒకరి పట్ల ఒకరు వ్యక్తం చేసుకునే ప్రేమ, అనురాగం, ఆప్యాయత, ఆమోదం ద్వారా పిల్లలు అనువైన ఆనందం, భద్రతతో కూడిన వాతావరణంలో పెరుగుతారు. సత్సంబంధ బాంధవ్యాలకు బీజం కుటుంబంలోనే వేయాలి. తల్లిదండ్రుల

ఆదర్శవంతమైన జీవనశైలి, బోధన ద్వారా ఇతరుల పట్ల ఎలా వ్యవహరించాలో, స్పందించాలో, స్నేహం పెంపొందించుకోవాలో నేర్పాలి. తల్లిదండ్రులు ఒకరి నొకరు అభినందించుకోవడం, ఒకరికోసం ఒకరు త్యాగం చేయడం పిల్లలు గమనించినప్పుడు అది ఒక ప్రమాణంగా వారు నేర్చుకుంటారు. ఇంట్లో పనులు అందరూ కలిసి చేసినప్పుడు, పని వారికి ఒక భారంగా మారదు. పిల్లలు కలసి ఆడుకునే ఏర్పాటు కల్పించాలి. బొమ్మలు, వస్తువులు కలసి పంచుకోవడం నేర్పాలి.

తమ తల్లిదండ్రులు 'ఎప్పుడూ బిజీ' అనే భావం వారిలో కలుగనివ్వకూడదు. 'బిజీ తల్లిదండ్రులు' వారి బిడ్డలకు సమయం కంటె ఖరీదైన బహుమానాలు, వస్త్రాలు, ఆధునిక వసతులు, ఇవ్వడానికి ప్రయత్నిస్తుంటారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు తక్కువ ప్రాధాన్యత నిచ్చి, కొంత సమయాన్ని కూడా కేటాయించలేకపోతే వారి బిడ్డలు ఒంటరితనం, తిరస్కార భావాలతో పెరుగుతారు. అబద్ధాలు చెబుతారు, ఇతరులను నమ్మరు, తాము ఎందుకూ పనికిరాని వారము, ఎవరికీ చెందని వారమనే, ఆత్మన్యూనతతో బాధపడతారు. బహుమానాలను ప్రశస్తంగా ఎంచి, భద్రపరచి, వికసించడానికి తోడ్పడాలి.

అనేకమంది తల్లిదండ్రులు పిల్లల ముందే ఎప్పుడూ కీచులాడుకుంటారు. ఒకరినొకరు గౌరవించుకోరు, ప్రేమ, విధేయత చూపరు. ఇటువంటి వాతావరణంలో పెరిగే పిల్లలు ఎప్పుడూ అభద్రతా భావనలతో బాధపడతారు. చిన్నప్పటి నుండే తల్లిదండ్రులకు విధేయత చూపేటట్లు శిక్షణనివ్వాలి. "నీ దేవుడైన యెహోవా నీకనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడగునట్లు నీ తండ్రిని, నీ తల్లిని సన్మానించుము" (నిర్గమ 20:12). ఇది వాగ్దానంతో కూడిన ఆజ్ఞ. బాల్యం నుండే వారికి దీని సారాంశాన్ని నేర్పాలి. "పిల్లలారా ప్రభువునందు తల్లిదండ్రులకు లోబడియుండుడి" తండ్రులారా మీ పిల్లలకు కోపము రేపవద్దు" (ఎఫెసీ 6:4). సమయం తీసుకుని దేనినైనా సరే ఏం చేయాలి, ఎలా చేయాలి, ఎందుకు చేయాలనేది వివరించాలి. దేవుడు ఆదాము, హవ్వలకు మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలముల విషయంలో ఏం చేయాలి, చేయకూడదు అని స్పష్టంగా వివరించి, వారి అవిధేయతను బట్టి శిక్షించారు.

> **కొన్నిసార్లు మమ్మీ మాట్లాడే కత్తిపోటు వంటి మాటలు హృదయానికి తూట్లు వేస్తే, డాడీ కొట్టే క్రూరమైన దెబ్బలకు శరీరం కమిలిపోతుంది. మరచిపోవద్దు. మన కోపతాపాలు, అహంకారం ప్రదర్శించడానికి వారు వస్తువులు కాదు. దేవుడిచ్చిన దానం. మనకు సంతోషాన్నిచ్చే సంపదలు వారు. తప్పులు చేసినా ప్రేమించడం, ప్రేమతో సరి చేయడం మంచిది.**

ఒక పనిని చేయమని చెప్పి, దానిని మరల నొక్కి చెప్పకపోతే పిల్లలు తల్లిదండ్రులను గౌరవించరు, అవిధేయత చూపుతూనే ఉంటారు. చెప్పిన విషయాన్ని ఫాలోఅప్ చేస్తూ ఉండాలి.

4. ఆధ్యాత్మిక ఎదుగుదల

బైబిల్ కథలు చెప్పడంతో దీనిని ఆరంభించాలి. దేవుడు ఇశ్రాయేలీయులకు ఇదే బోధించారు. "నేడు నేను నీకాజ్ఞాపించు ఈ మాటలు నీ హృదయములో ఉండవలెను. నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపచేసి, నీ యింట కూర్చున్నప్పుడును, త్రోవను నడుచునప్పుడును పండుకొనునప్పుడును లేచునప్పుడును వాటిని గూర్చి మాటలాడవలెను; సూచనగా వాటిని నీ చేతికి కట్టుకొనవలెను" (ద్వితీ 6:6,7).

అనుదిన జీవితంలో దేవుని గురించి వివరించే, అవకాశాలను సృష్టించాలి. బైబిలు సత్యాలను వివరించాలి. తద్వారా వారికి వాక్య జ్ఞానం పెరుగుతుంది. పిల్లలు చదవడం ఆరంభించినప్పటి నుండి వారి వయస్సుకు తగిన ఆధ్యాత్మిక సాహిత్యం అందుబాటులో ఉంచాలి. అనుదినం క్రమంగా కుటుంబ ప్రార్థన జరిగించాలి. దీనిలో వారు విలువలు, ప్రమాణాలను నేర్చుకుంటారు. కుటుంబ ఆరాధన అంటే "దేవునిని ఆరాధించి, ప్రార్థించి, హత్తుకొని, సమర్పించుకొనే మనస్సు కలిగి ఉండటం". మన కుటుంబ ప్రార్థనలు ఎలా ఉన్నాయి. అప్పుడప్పుడు? ఎప్పుడైనా? జరగనే జరగవా?

దేవుడు మన నుండి ప్రాథమికంగా కోరేది ఆయనని మనం ప్రేమించి, ఆ ప్రేమ ఇతరులకు అందించాలని, అది మన బిడ్డలకు కూడా అందించాలని ద్వితీ

6:6,7లో వివరించారు "నేడు నేను నీకాజ్ఞాపించు ఈ మాటలు నీ హృదయంలో ఉండవలెను. నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపజేసి, నీ యింట కూర్చుండునప్పుడును, త్రోవను నడుచునప్పుడు, పండుకొనునప్పుడును, లేచునప్పుడును వాటిని గూర్చిమాటలాడవలెను". దీనిని క్రియాత్మకంగా అయిదు రీతులలో చేయాలి.

దేవుని ఆజ్ఞలను హృదయంలో ఉంచడం: బిడ్డల జీవితాల మీద మంచి ప్రభావం చూపేలా ఈ సత్యాలను వారి మనస్సులో, హృదయాలలో బలంగా నాటాలి. అవి వారి వ్యక్తిత్వాన్ని మలచగలగాలి. యేసుప్రభువును చిన్న వయస్సులోనే తమ సొంత రక్షకునిగా అంగీకరించేలా నడిపించాలి.

వాటిని గురించి మాట్లాడాలి: సాధారణంగా తల్లిదండ్రులే వారేం చేయాలి, ఎలా ఉండాలి అనేది ఎక్కువ శాతం వివరిస్తూ ఉంటారు. 'మాట్లాడడం' అంటే ఇరువైపులా జరిగే ప్రక్రియ. పిల్లల భావాలను, భావావేశాలను, ఆలోచనలను, అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశం ఇవ్వాలి. ఇటువంటి సంబంధ బాంధవ్యాలు ఉన్నప్పుడు నమ్మకంగా, యధార్థంగా తల్లిదండ్రుల పట్ల వ్యవహరిస్తారు.

మీ ఇంట కూర్చున్నప్పుడు: కుటుంబ సభ్యులు సరదాగా కూర్చుని కలసి మాట్లాడుతున్నప్పుడు స్కూల్‌లో, కాలేజీలలో వారి దినచర్యను గురించి ప్రస్తావించినప్పుడు ఈ సత్యాలను ఎలా అన్వయించుకోవాలో వారికి సహజ వాతావరణంలో నేర్పాలి. ఉదా: అబద్ధమాడితే, కాపీ కొడితే వచ్చే పర్యవసానాలు.

త్రోవను నడుచునప్పుడు: పిల్లలకు బైబిలు కథలను వివరించలేని స్థలమేదైనా ఉందా?

పండుకున్నప్పుడు, లేచినప్పుడు: ఉదయం లేచిన దగ్గర నుండి పడుకునే సమయం వరకు ఎప్పుడైనా సమయోచితంగా, సందర్భానుసారంగా ఈ సత్యాలను చెప్పాలి.

కలసి ప్రార్థించే కుటుంబం కలిసికట్టుగా జీవిస్తుందనే సత్యం వాస్తవమే. సండే స్కూల్‌కు పంపడం, దేవుని వాక్యాలను కంఠత పెట్టించడం ఇవన్నీ కుటుంబంలో తల్లిదండ్రులు చేయాల్సిన పనులు. చదవడం ఆరంభించినప్పటి నుండి మౌనధ్యాన సమయం చేసుకోవడం నేర్పాలి. కుటుంబంలో నేర్చుకున్న ఈ సత్యాలు, విలువలు వారు ఏ ప్రదేశంలో ఉన్నా వారిని విడిచిపోవు, పైగా వారికి భద్రతనిస్తాయి.

కమ్యూనికేషన్

మాటలకు శక్తి ఉంది. మంచి, చెడ్డ ఫలితాలు చాలా వరకు మాటల ద్వారా కలుగుతాయి. "నోట నుండి బయటకు వచ్చునది హృదయములో నుండి వచ్చును" మత్తయి 15:18. మన పిల్లలు మనలను పుస్తకాల్లా చదవగలరు. మన దృక్పథాలను, చర్యలను అనుకరించడమే కాదు మాట్లాడే పద్ధతిని అనుసరిస్తారు. "విజయవంతమైన వివాహానికి, కుటుంబానికి అవసరమైనవి ప్రాముఖ్యమైనవి నాలుగు అంశాలు: నమ్మకం, కలసి సమయం గడపడం, స్పర్శ, మాట్లాడడం". దీనిలో దేనిని ఉపేక్షించినా కుటుంబం సమస్యల్లో పడుతుందని." అంటాడు ఒక మ్యారేజ్ కౌన్సిలర్.

కొన్నిసార్లు మమ్మీ మాట్లాడే కత్తి పోటువంటి మాటలు హృదయానికి తూట్లు వేస్తే, డాడీ కొట్టే క్రూరమైన దెబ్బలకు శరీరం కమిలిపోతుంది. మరచిపోవద్దు. మన కోపతాపాలు, అహంకారం ప్రదర్శించడానికి వారు వస్తువులు కాదు. దేవుడిచ్చిన దానం. మనకు సంతోషాన్నిచ్చే సంపదలు వారు. తప్పులు చేసినా ప్రేమించడం, ప్రేమతో సరిచేయడం మంచిది. వారి అభిప్రాయాలను అడగండి, కుటుంబ నిర్ణయాలలో వాటిని పరిగణలోకి తీసుకోవాలి. వాగ్దానాలను నెరవేర్చాలి. వారిని ప్రశంసిస్తూ చిన్న చిన్న బహుమానాలివ్వాలి. వారిని ప్రేమిస్తున్నామనే విషయం మళ్ళీ మళ్ళీ చెప్పాలి, చేతలలో చూపాలి. వారి స్నేహితులెవరో, వారు టి.వి.లో, మొబైల్స్‌లో ఏం చూస్తున్నారో తెలుసుకోండి. స్నేహితులతో గడపడానికి అవకాశం ఇవ్వాలి. చెడ్డ స్నేహితులుంటే ఫలితాలు వివరించి, సమయం ఇచ్చి ఇతర స్నేహితులను ఎంపిక చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలి. ఇతరుల ముందు వారిని అవమానించడం, బలహీనతలను బయటపెట్టడం చేయకూడదు. ఎక్కువ సమయం ఒంటరిగా గడిపే అవకాశం ఇవ్వకూడదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఫోన్ చేసి వాకబు చేయాలి.

ఆదర్శం

"నీతి మార్గాలలో నీ పిల్లలను నడిపించాలని

నీవు ఎంత ప్రయత్నించినా నీ అడుగుజాడల్లోనే నడవాలని ఇష్టపడతారు" అంటారు ఆర్నాల్డ్‌గ్లాసో. మంచి విలువలు, జీవనశైలి అనుకరించడంలో, నీ పిల్లలకు ఆదర్శవాది నీవేనా? "నేను చెప్పింది చెయ్యి. నేను చేసేది చేయకు" అనే వైఖరి కాకుండా "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారం మీరు నన్ను పోలి నడుచుకొనుడి" అని పౌలు చెప్పిన రీతిలో తల్లిదండ్రులు వారి జీవితంలో ఆత్మఫలాలను వ్యక్తం చేయాలి.

క్రమశిక్షణ

తల్లిదండ్రులు 'కోచ్' లాంటి వారు. శిక్షించడం మాత్రమే క్రమశిక్షణ కాదు. క్రమశిక్షణ అంటే బెత్తం గుర్తుకురావడం కాదు. 'డిసిప్లిన్' అనే పదం 'డిసైపుల్' అనే పదం నుండి ఆవిర్భవించింది. అంటే 'నేర్చుకొనువాడు' అని అర్థం. చేసే పనులను సరైన పద్ధతిలో చేసేలా, క్రమమైన ప్రవర్తనా సరళిని అర్థం చేసుకొని దానినే ఎంచుకొనేలా తల్లిదండ్రులు పురికొల్పాలి. క్రికెట్ కోచ్, ఆటగాళ్ళు మెరుగ్గా రాణించడానికి, తప్పు చేసినా, శిక్షణనిస్తూనే ఉంటాడు.

అవిధేయత చూపితే అన్ని సందర్భాల్లో కొట్టడం మంచి పద్ధతి కాదు. వయస్సును బట్టి నియంత్రించాలి. కోచింగ్ ఇవ్వాలి, కౌన్సిల్ చేయాలి, శ్రద్ధ చూపాలి. బెత్తంతో శిక్షించాలనుకునా౧్న రౌద్రంతో కొట్టకుండా భావావేశాలు అదుపులో ఉంచుకొని బిడ్డ బాగుపడాలనే ఉద్దేశంతో శిక్షించాలి.

ప్రార్థించడం

పిల్లల కోసం, వారితో కలిసి ప్రార్థించాలి. యేసుక్రీస్తు శిష్యుల కోసం ప్రార్థించారు. యోబు తన కుమారులు, కుమార్తెల నిమిత్తం ప్రార్థించాడు (యోబు 1:5). దేవుని వాక్య జ్ఞానంలో ఎదగాలని, ఆయన ప్రేమను స్వయంగా అనుభవించాలని ప్రార్థించాలి.

- ❖ దేవుని చిత్తాన్ని గ్రహించి, నెరవేర్చాలని ప్రార్థించాలి.
- ❖ దేవుని మీద ఆధారపడి, తమ జీవితంలో అన్ని విషయాలలో ఆయనకు ప్రాధాన్యం ఇచ్చేలా ప్రార్థించాలి.
- ❖ దేవుని కోసం ఉప్పు, వెలుగు వలె జీవించాలని ప్రార్థించాలి.
- ❖ మనోహ ప్రార్థించినట్లు మనకు దేవుడిచ్చిన బిడ్డలను ఆయన మహిమ కోసం ఎలా పెంచాలో ప్రార్థించాలి (న్యాయా 13:14).

'టీనేజర్స్' పెంపకంలో దృష్టించాల్సిన విషయాలు:

''యౌవనులు దేనిచేత తమ నడతను శుద్ధిపరచుకొందురు? నీ వాక్యమును బట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనేగదా'' కీర్తన 119:9

బాల్య దశ నుండి టీనేజ్ దశకు చేరుకొన్నప్పుడు వారి శరీరం, మనస్సు, భావావేశాలలో కలిగే మార్పును బట్టి వారితో ఎలా వ్యవహరించాలో తల్లిదండ్రులకు కొంత కష్టంగానే ఉంటుంది. కొంత బడలిక, విసుగుకు లోనవుతారు. దీనితోపాటుగా ఈ దశలో వారు అత్యధికమైన సత్తువ కలిగి ఉంటారు. నూతన అవకాశాలను, విషయాలను కనుక్కోవాలనే ఆత్రుత ఉంటుంది. బాల్యంలోనే దైవానుసారమైన విలువలు నాటినప్పుడు, వారు టీనేజ్ దశలో, అల్లకల్లోలమైన పరిస్థితిని తట్టుకోవడానికి సహాయపడుతుంది. దేవుని నమ్మడమే కాదు, దేవుని వాక్యాన్ని అనుదినం చదివే అలవాటును ప్రోత్సహించాలి. ఒక మంచి క్రైస్తవ సహవాసంలో పాలుపంచుకోవడానికి పురికొల్పాలి.

- ❖ యుక్తవయస్సును ఎదుర్కోవడానికి సిద్ధపరచాలి–గృహంలో సెక్స్ విద్యను నేర్పాలి.
- ❖ మంచి స్వయం అంచనాను, దాన్ని అంగీకరించుకోవడంలో బలపర్చాలి.
- ❖ స్వేచ్ఛనిస్తూ, బాధ్యతను గుర్తు చేయాలి (చేయాల్సినవి, చేయకూడనివి)
- ❖ ప్రాధాన్యతలు ఎంచుకోవడం, నిర్ణయాలు చేయడంలో కౌన్సిల్ చేయాలి. (చిన్న నిర్ణయాలు మొదలు విద్యాపరమైన విషయాలు)
- ❖ సమస్యలు పరిష్కరించుకోవడం

గతంలో తాము విషయాలను మెరుగ్గా చేయగలిగామని ప్రతీ తరం భావిస్తారు. సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు, పిల్లలకు జీవితాన్ని ఎదుర్కోవడం నేర్పాలి.

– క్రిస్టియన్ హోమ్ డిపార్ట్‌మెంట్,
యుఇయస్ఐ–ఏపి

బైబిల్ స్టడీ

కుటుంబంలో ఐక్యత

(2 రాజులు 4:8-37; 8:1-6)

దైవికమైన వివాహ కుటుంబ వ్యవస్థలు కనుమరుగవుతున్న సమాజంలో మనం జీవిస్తున్నాం. విడాకుల సంఖ్య పెరిగిపోతున్నది. 'గే' వివాహ హక్కు కోసం అనేకమంది పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్నారు. సహజీవనంతో మరికొంత మంది తృప్తి చెందుతున్నారు. వేగంగా మారుతున్న ఇలాంటి సమాజంలో జీవిస్తున్న మనం సార్వభౌముడైన మన ప్రభువు అధికారం క్రింద జీవిస్తూ క్రైస్తవ వివాహం అన్నది స్త్రీ, పురుషుల మధ్య ఒక నిబంధన అను విషయాన్ని గుర్తుచేసుకుంటూ ఉండాలి. దైవికమైన సంబంధాన్ని భూమి మీద ప్రదర్శించడానికి మనం పిలువబడ్డాము. మానవులను తిరిగి తన వద్దకు తీసుకునే దేవుని పరిచర్యలో 'కలసి పాల్గొనుటకు' క్రైస్తవ వివాహం ద్వారా ఒక స్త్రీ, పురుషుడు ఏకం చేయబడతారు. దేవుని దర్శనాన్ని నెరవేర్చిన అనేకమంది దంపతులను మనం బైబిల్ గ్రంథంలో చూస్తాము. అలా దేవుని ఉద్దేశాన్ని నెరవేర్చిన అద్భుతమైన కుటుంబాలలో ఒకటి షూనేమీయురాలైన స్త్రీ, ఆమె భర్త (2 రాజులు 4:8-37; 8:1-6).

ఇశ్శాఖారు గోత్రములో యెజ్రెయేలు మన్యమునకు దగ్గర్లో షూనేము అను పట్టణము ఉన్నది. ఈ పట్టణం కర్మెలు పర్వతానికి సుమారు 20 కిమీ దూరంలో ఉన్నది.

పురుషాధిక్య సమాజంలో, కుటుంబ విషయాలను, కుటుంబేతర విషయాలను తన భర్త సహకారంతో ఒక స్త్రీ నెరవేర్చడం అన్నది చాలా అరుదుగా జరుగుతుంది. కాని సంస్కృతి ఏదైనప్పటికీ, దేవునికి, దేవుని వాక్యానికి లోబడే వారు తమ జీవితంలోని విషయాలను కలసికట్టుగా నెరవేరుస్తారన్న విషయం ఈ వాక్యభాగాన్ని పఠించడం ద్వారా మనకు అర్థమౌతుంది.

ప్రశ్నలు:

1. షూనేమీయురాలు ఏయే విషయాల్లో చొరవ తీసుకొన్నది?

2. తన కుటుంబ లాభం కోసం ఆమె తన హోదాను, ప్రవక్తతో పరిచయాన్ని ఎన్నడూ ఉపయోగించలేదని మనం ఎలా చెప్పగలము?
3. దేవుడు వారి ఆశను ఎలా తీర్చాడు?
4. వీరు ఒకరితోనొకరు ఎలా సహకరించుకున్నారు?
5. తన బిడ్డ మరణించాడన్న వార్త తన భర్తకు చెప్పకుండా ఉండటానికి కారణాలు ఏమై ఉంటాయి?
6. తన పనిని నెరవేర్చుటలో తన భర్త ఆమెకు ఎలా సహాయం చేశాడు?
7. వీరిద్దరిలో మనకు కన్పించే మంచి లక్షణాలు ఏంటి?
8. నిస్వార్థమైన తమ సేవకుగాను ఈ దంపతులు ఎలాంటి బహుమానం పొందారు?
9. క్రైస్తవ దంపతులుగా ఒకరికొకరం మనం సమయాన్ని ఏవిధంగా కేటాయించుకోగలము? తన భాగస్వామి తనకు తగినంత సమయం ఇవ్వకపోతే భార్యాభర్తల మధ్య ఐక్యతకు ఎలాంటి భంగం కలుగుతుంది?
10. స్త్రీలపై వివక్షత చూపించే కొన్ని సంస్కృతి, సాంప్రదాయాలను చర్చించండి. దేవుని యందు మన విశ్వాసం, దేవుని వాక్యపఠనం మన కుటుంబాలలో సమానత్వాన్ని, ఐక్యతను ఎలా పెంపొందిస్తాయి?

– రోసమ్మ మాథ్యూ, ఢిల్లీ

ప్రత్యేకం

క్షమాపణకు 10 మార్గాలు...

పరిచయం

'నేను అతణ్ణి క్షమించను', "క్షమిస్తాను గాని అతను చేసిన దాన్ని నేను ఎన్నడూ మరచిపోను". ఈ మాటలు నీవు ఎప్పుడైనా అన్నావా? నీ జీవితంలో జరిగిన నష్టానికి, అవమానానికి, వేదనకు, అకారణంగా దూషింపబడడానికి కారణమైన వారిని నీవు క్షమించగలవా? మనలో చాలామందికి ప్రతిరోజు గాయపరిచే సంఘటనలు, అనుభవాలు ఎదురవుతాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇవి మన క్షమాగుణాన్ని పరీక్షిస్తాయి. మనల్ని తీవ్రంగా బాధించే, నొప్పించే అనేక సంఘటనలు, అనుభవాలు మనకు జీవితాంతం ఎదురవుతూనే ఉంటాయి.

క్షమాగుణం లేదా క్షమించడం అనేది అత్యంత ప్రాముఖ్యమైన భావోద్వేగ, మానసిక లక్షణాలలో ఒకటి. కోపం, పగ, విచారం, నొచ్చుకోవడం, శత్రుత్వం వంటి భావోద్రేకాలు దీని ద్వారా సమసిపోతాయి. సమాధానపడడం, తగ్గి ఉండడం, పశ్చాత్తాపం చెందడం, పరిహారం చేయడం వంటివి ఇందులో ఇమిడి ఉన్నాయి.

క్షమాగుణాన్ని పెంపొందించు కోవడానికి సహాయపడే 10 మార్గాలను ఈ వ్యాసంలో తెలియజేయడం జరిగింది. ఈ 10 మార్గాలు ఇదే క్రమంలో చేయాలనేంలేదు. క్షమాపణ అవసరం, ఎదురైన పరిస్థితిని బట్టి దేన్నైనా, ఎప్పుడైనా ఉపయోగించవచ్చు.

క్షమాపణకు 10 మార్గాలు

1. కోపాన్ని తీసివేసుకొండి

గాయపరచిన, నొప్పించిన సంఘటనను పదేపదే ఆలోచిస్తే ద్వేషానికి, పగకు దారి తీస్తుంది. ఇది చాలా నష్టానికి దారి తీస్తుంది. 'హీలింగ్ అవర్ యాంగర్: సెవన్ వేస్ టు మేక్ పీస్ ఇన్ ఎ హోస్టైల్ వరల్డ్' అనే పుస్తకంలో ఎనిమిది రకాల కోపాలు ఉన్నాయని డా॥ మైకెల్ ఓబ్‌సాట్ తెలియజేశారు. అవి ఏంటంటే..

1. **చల్లారని కోపం:** ఇతరుల పట్ల ఎప్పుడూ ఉండే ద్వేషం ఇది.
2. **భగభగలాడే కోపం:** ఇది చాలా తీవ్రంగా ఉంటుంది. కాని ఎక్కువసేపు ఉండదు.
3. **తీర్పు తీర్చే కోపం:** ఇతరులు ఫలానా, ఫలానా అని నిందించే మాటలు వస్తాయి.
4. **కనిపించని కోపం:** కోపం వ్యక్తుల మీద చూపించలేక వేరే వాటి మీద చూపించే కోపం.
5. **నిస్సహాయత మూలంగా వచ్చే కోపం:** సంక్లిష్ట పరిస్థితులకు సరైన పరిష్కారం దొరకనప్పుడు వచ్చే కోపం.
6. **పగతీర్చుకొనే కోపం:** వ్యక్తులపై డైరెక్ట్‌గా చూపిస్తాము.
7. **మనపై మనకే కోపం:** మనమీదే మనకు కొన్నిసార్లు కోపం వస్తుంది.

"నేను నిన్ను కొట్టినప్పుడు ఇసుక మీద రాశావు. రక్షించినప్పుడు బండ మీద రాశావు" కారణం ఏంటి?" "ఎవరైనా మనల్ని బాధించినప్పుడు, నొప్పించినప్పుడు, దాన్ని ఇసుకపై రాయాలి. కొంత సమయానికి క్షమాపణ గాలులు చెరిపి వేస్తాయి. కానీ ఒక వ్యక్తి మనకు మంచి, మేలు చేసినప్పుడు మనం దాన్ని రాతిపై చెక్కాలి. దాన్ని ఏ గాలి చెరిపివేయలేదు"

---

8. **నిర్మాణాత్మక కోపం:** మంచిని ఆశించి చూపించే కోపం.

పైవాటిలో చివరిది మినహా మిగిలినవన్నీ హానికరమైనవే. గతంలో జరిగిన దానిపై మనం కోపిస్తూ ఉంటే, అది మన సంతోషాన్ని నాశనం చేస్తుంది. మనం మానసికంగా, భావోద్రేకపరంగా ఆరోగ్యంగా ఉండాలంటే కోపాన్ని సాధ్యమైనంత త్వరగా వదులుకోవాలి. మరోవిధంగా చెప్పాలంటే, 'లైట్‌గా తీసుకోవాలి'. క్షమాగుణం కోపాన్ని తగ్గిస్తుంది, మనశ్శాంతిని ఇస్తుంది.

2. పట్టుదలకు పోకండి

కొన్నిసార్లు మనల్ని నొప్పించిన వ్యక్తి పట్ల కోపంగా ఉండడం చాలా అవసరం అనిపిస్తుంది. కనీసం తప్పుయిపోయింది అని కూడా చెప్పని వ్యక్తిని నేను ఎందుకు క్షమించాలి? అనే పట్టుదలకు పోతాం. దాంతో తృప్తి చెందుతాం, మనల్ని మనం సమర్థించుకొంటాము. కానీ అలాంటి అభిప్రాయంలోనే కొనసాగవద్దు, మొండి పట్టుదలకు పోవద్దు. నీవే ఒక అడుగు ముందుకు వేయి. కోపం, మొండి పట్టుదల సంబంధాలను నాశనం చేస్తుంది.

3. నీకు అన్యాయం జరిగిందని భావించుకోవద్దు

సాధారణంగా, ఇతరులు మనపట్ల తీవ్రమైన తప్పు చేశారని భావించినప్పుడు మనం వారిపై కోపపడతాం. ఇది నిజంగానే జరిగి ఉంటుంది లేదా కొన్నిసార్లు మనం అలా ఊహించుకొంటాము. మనకు అన్యాయం జరిగిందని, మనల్ని సరిగ్గా చూడలేదని, అమర్యాదగా ప్రవర్తించారని భావిస్తుంటాము. మన మీద మనకు జాలి వేస్తుంది. ఇతరులు కూడా మనపై జాలి చూపించాలని కోరుకొంటాము. బలయ్యామని భావించే వ్యక్తుల మనస్తత్వం ఇలానే ఉంటుంది. మనకు అన్యాయం జరిగిందని మనం భావించినప్పుడు ఇలాంటి మానసిక స్థితిలోకి సులభంగా వెళ్తాము.

ఇలాంటి ఆలోచనలు కొంతవరకు మనకు ఓదార్పునిస్తాయి. కాని చివరకు అది ద్వేష భావానికి, క్షమించలేని స్థితికి దారి తీస్తాయి. మనకు ఎవరైనా హాని చేస్తారేమో అని ఎల్లప్పుడూ అతిజాగ్రత్తతో ఉండే పరిస్థితికి వెళ్తాము.

బిషప్ టుటు క్షమాపణను వివరిస్తూ ఒక సంఘటనను ప్రస్తావించాడు. ఒకసారి ఇద్దరు మాజీ సైనికులు వియత్నాం యుద్ధ జ్ఞాపక చిహ్నాన్ని సందర్శించారు. వారిలో ఒకరు ఇలా ప్రశ్నించాడు, "యుద్ధఖైదీగా నిన్ను బంధించిన వారిని నీవు క్షమించావా?" "లేదు. నేను వారిని ఎన్నడూ క్షమించను" అని బదులిచ్చాడు రెండవ వ్యక్తి. "అయితే నువ్వు ఇంకా జైల్లోనే ఉన్నావన్నమాట" అని అన్నాడు మొదటి వ్యక్తి. ఈ మాట ఆ రెండవ వ్యక్తి దృక్పథంలో మార్పును తీసుకొచ్చింది. "నేను బలయ్యాను" అని భావించినంత కాలం మనం ఇతరుల్ని క్షమించలేము.

4. భవిష్యత్‌పై దృష్టిపెట్టు

జరిగిందేదో జరిగింది. గతాన్ని ఆలోచిస్తూ ఉంటే గాయం పెద్దదవుతుంది. ఒకసారి నాకు ఒక వ్యక్తి ఈమెయిల్ పంపించాడు. నేను సాధారణంగా వాటిని ఒకసారి చూసి, డిలీట్ చేస్తాను. ఇప్పుడు వచ్చిన మెయిల్ 'ఇసుక మరియు రాయి' అనే అంశంతో వచ్చింది. ఇది ఇద్దరు స్నేహితుల కథ. వారు ఒకసారి ఒక ఎడారి గుండా ప్రయాణిస్తూ ఉన్నారు. కొంతసేపటికి వారిద్దరూ వాదించుకోవడం మొదలు పెట్టారు. వారిలో ఒకడు రెండవవాణ్ణి మొహంపై కొట్టాడు. దెబ్బతిన్నవాడు చాలా బాధపడ్డాడు. కాని ఒక్క మాట కూడా పలకలేదు. "నా ప్రాణస్నేహితుడు ఈరోజు నన్ను మొహంపై కొట్టాడు" అని ఇసుకపై రాశాడు. తర్వాత వారు ప్రయాణాన్ని కొనసాగించారు. కొంతదూరం వెళ్ళిన తర్వాత వారికి ఒక ఒయాసిస్ కన్పించింది. దానిలో స్నానం చేయడానికి వారు సిద్ధపడ్డారు. వారు స్నానం చేస్తున్న సమయంలో చెంపదెబ్బ తిన్న వ్యక్తి ఊబిలో దిగబడి

మునిగి పోతున్నాడు. చెంపదెబ్బ కొట్టిన వ్యక్తి అతణ్ణి రక్షించాడు. అతను కోలుకొన్నాక ఒక రాతిపై ఇలా రాశాడు, "నా ప్రాణ స్నేహితుడు ఈరోజు నన్ను కాపాడాడు". కొట్టిన వ్యక్తి, రక్షించిన వ్యక్తి అతణ్ణి ఇలా ప్రశ్నించాడు, "నేను నిన్ను కొట్టినప్పుడు ఇసుక మీద రాశావు. రక్షించినప్పుడు బండ మీద రాశావు" కారణం ఏంటి?" "ఎవరైనా మనల్ని బాధించినపుడు, నొప్పించినప్పుడు, దాన్ని ఇసుకపై రాయాలి. కొంత సమయానికి క్షమాపణ గాలులు చెరిపివేస్తాయి. కానీ ఒక వ్యక్తి మనకు మంచి, మేలు చేసినప్పుడు మనం దాన్ని రాతిపై చెక్కాలి. దాన్ని ఏ గాలి చెరిపి వేయలేదు" అని బదులిచ్చాడు.

మన కుటుంబ సభ్యుల్లో, సహోద్యోగుల్లో, తోటి సంఘస్తులలో ఎవరో ఒకరు మనల్ని నొప్పిస్తూ ఉంటారు. ఇలాంటి సందర్భాల్లో వారితో మనకు ఉన్న సంబంధాన్ని గుర్తుంచుకొని, గాయాన్ని మరచిపోవాలి. జరిగిన విషయంపై కాకుండా భవిష్యత్‌పై దృష్టిపెట్టాలి. క్షమాపణ ఒక క్రొత్త ప్రారంభాన్ని ఇస్తుంది, సంబంధాలను పునరుద్ధరిస్తుంది.

5. మరలా నమ్మడం నేర్చుకోవాలి

సంపూర్ణ క్షమాపణ అంటే నన్ను గాయపరచిన వ్యక్తిని నేను మరలా నమ్మడం నేర్చుకోవడం. నమ్మడాన్ని నేర్చుకోవడం అంటే నిర్మాణాత్మక విమర్శను ఆహ్వానించడం. నీ చుట్టూ ఉన్న వాళ్ళు నీ గురించి ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను నీవు స్వీకరించగలగాలి. ఇవి నిన్ను గాయపరచాలని ఉద్దేశించబడినవి కావు. ఆ వ్యక్తి తెలియజేస్తున్న సద్విమర్శపైనే దృష్టి పెట్టు. అతడు మాట్లాడిన స్వరం, శరీర భాషను పట్టించుకోకూడదు. కొంతమందికి సరైన రీతిలో సంభాషించడం ఎలాగో తెలియదు. అయినప్పటికీ బాధించాలనే ఉద్దేశం వారిలో ఉండదు.

మరలా నమ్మడం నేర్చుకోవడంలో ఇంకొక విషయం కూడా ఉన్నది. గాయపరిచిన వ్యక్తితో సమాధానపడాలి. క్షమాపణ అనే అంశంపై ఎవరెట్ వర్థింగ్‌టన్ ప్రసిద్ధి చెందిన 'ఫర్గివ్‌నెస్ అండ్ రికన్సిలియేషన్' అనే పుస్తకాన్ని రచించాడు. ఆ పుస్తకంలో ఆయన ఇలా రాశాడు "సంబంధాలలో నమ్మకం కోల్పోయినప్పుడు దాన్ని మరలా పునరుద్ధరించడాన్నే సమాధానపడడం అని అంటారు". సమాధానపడకుండా ఇతరులతో చేసే సంభాషణల మూలంగా నెగెటివ్ ఫలితాలు వచ్చే అవకాశం ఉన్నది. మనకు హాని చేయని వ్యక్తులను నమ్మడం చాలా తేలిక. హాని చేసిన వారిని నమ్మడం కష్టం. కాని సమాధానపడడం ద్వారా సంబంధాలు మెరుగవుతాయి.

6. ఇతరుల నుండి ఆశించేటప్పుడు పట్టుదలగా ఉండకూడదు

కోపంలో మన భావోద్వేగాలు చాలా తీవ్రస్థాయిలో ఉంటాయి. ఆ సమయంలో మనం తెలియజేసే అభిప్రాయాలలో ఖచ్చితత్వం ఉండదు. మనకు జరిగిన అన్యాయాన్ని వారు వెంటనే గుర్తించి అక్కడికక్కడే క్షమాపణ చెప్పాలని భావిస్తాము. అలా చెప్పినప్పుడే ఆ వ్యక్తిలో నిజాయితీ ఉందని అనుకొంటాము.

ఎక్కువ సందర్భాల్లో నొప్పించాలని ఎవరూ ఏమీ మాట్లాడరు, చేయరు. తాను నొప్పించానని అవతలి వ్యక్తి గుర్తించకపోతే, వారి నుండి క్షమాపణను ఎలా ఆశిస్తాము? సమాధాన స్థితికి మనమే కొంత అవకాశాన్ని కల్పించాలి.

7. క్షమించడానికి సమయం పడుతుందని తెలుసుకోవాలి

ఈ ఇంటర్నెట్ యుగంలో అన్నీ వేగవంతంగా, త్వరగా జరిగిపోవాలని ప్రజలు కోరుకొంటారు. కాని గాయం మానడానికి సమయం పడుతుంది. భావోద్రేకాలకు అయిన లోతైన గాయాలు (ఉదా. ప్రియమైనవారు చనిపోవడం, నేరం, భార్యభర్తల మధ్య గొడవలు) చాలా తీవ్రంగా ఉంటాయి. గాయపరిచిన వారిని క్షమించాలన్న ఆలోచన ఈ సమయంలో వారికి రాకపోవచ్చు.

కాని గాయపరచిన మాటలు, పనులు, పద్ధతులను వెంటనే క్షమించే అవకాశము ఉన్నది. ట్రాఫిక్‌లో ఎవరైనా నీ వాహనాన్ని దాటి ముందుకు వెళ్ళినప్పుడు నీకు ఎప్పుడైనా కోపం వచ్చి ఉంటుంది. కాని

కొన్ని నిమిషాలకే దాన్ని మరచిపోయి డ్రైవింగ్ మీద దృష్టిపెడతావు. నీ గమ్యస్థానానికి చేరే సమయానికి దాన్ని పూర్తిగా మరచిపోతావు. నీ వాహనాన్ని దాటి వేగంగా వెళ్ళిన వాహనం ఏ రంగులో ఉందో కూడా నీకు గుర్తుండకపోవచ్చు.

ఒక వ్యక్తిపై నీవు ఎందుకు కోపపడ్డావో నీకు గుర్తుందా? ఏ విషయాన్ని బట్టి ఆ వ్యక్తి నీకు కోపం తెప్పించాడో ఆ విషయాన్ని కొన్ని నెలలకు నీవు మరచిపోతావు. నీకు ఎందుకు కోపం వచ్చిందో గుర్తులేదంటే నీకు తెలియకుండానే అతణ్ణి క్షమించావని అర్థం.

8. నీ హృదయాన్ని పరీక్షించుకో (ఇది చాలా కష్టమైనది)

నీవైపు నుండి ఏమైనా తప్పు ఉన్నదేమో పరీక్షించుకో. నీ మాటలు, ప్రవర్తనలో ఏమైనా తప్పు ఉన్నదేమో పరీక్షించుకో. రాజ్యాంగం మనకు మాట్లాడే స్వేచ్ఛను ఇచ్చింది. కానీ ఇతరులను నొప్పించే మాటలు మాట్లాడే స్వేచ్ఛ మనకు లేదు. మన హృదయాన్ని పరీక్షించుకోవడానికి కొన్ని సూత్రాలు, విలువలు ఉన్నాయి. అవి మనకు తెలియనివి కావు. కాని వాటిలో 10 మీకు గుర్తు చేస్తాను:

- ❖ ఇతరుల పట్ల సహనంతో ఉండాలి.
- ❖ నిన్ను ఇతరులు ఎలా చూడాలని కోరుకొంటావో నీవు కూడా వారిని అలానే చూడు.
- ❖ సంభాషణల్లో మర్యాదగా మాట్లాడు.
- ❖ ఎల్లప్పుడూ ఇతరులను గౌరవించు.
- ❖ ఇతరులను విమర్శించకు.
- ❖ తొందరపడి నిర్ణయాలకు రావద్దు/తొందరపాటు నిర్ణయాలు వద్దు.
- ❖ ప్రతిసారి ఇతరులకు అవకాశం ఇవ్వు.
- ❖ ప్రతి చిన్నదాన్ని బూతద్దంలో చూడకు.
- ❖ మంచి దృక్పథంతో ఉండు.
- ❖ క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉండు.

9. క్షమాగుణం నీ దైనందిన లక్షణంగా అలవర్చుకో

జరిగిన తప్పును పదే పదే ప్రస్తావించకుండా, అది జరిగిన వెంటనే క్షమించే లక్షణం ఉంటే ఎంత బాగుంటుందో కదా! అది ఎంత గొప్ప మార్పో కదా! క్షమాగుణం మన దైనందిన లక్షణంగా ఉన్నప్పుడే ఇది సాధ్యమౌతుంది. కోపం, పగ, ద్వేషాన్ని చూపించడం ద్వారా మనలో ఎంతో శక్తి వినియోగం అవుతుంది. ఆ శక్తిని వాటిపై కాకుండా, పరిచర్య మీదనో, ఇతర విశ్వాసులను బలపర్చడానికో వినియోగిస్తే ఎంత బాగుంటుందో కదా! నీవు పొందిన గాయంపై మనస్సు పెట్టకుండా, దేవుని పరిచర్య మీద, ఇతరుల మీద దృష్టిపెడదాం. క్షమాపణ మన జీవితాల్లో ప్రధాన భాగమయ్యేటట్లు చూసుకొందాం.

10. దేవుని సహాయాన్ని కోరు

క్షమించడం, క్షమాపణ కోరడం ఒక జ్ఞానయుక్తమైన నిర్ణయం మాత్రమే కాదు, అది ఒక ఆధ్యాత్మిక సామర్థ్యం. మత్తయి సువార్తలో ప్రభువు చెప్పిన క్షమించని సేవకుని ఉపమానంలో క్షమించడం అంటే ఏమిటో తెలియజేయబడింది. “ఆ సమయమున పేతురు ఆయన వద్దకు వచ్చి – ప్రభువా, నా సహోదరుడు నా యెడల తప్పిదము చేసిన యెడల నేనెన్ని మారులు అతని క్షమింపవలెను? ఏడు మారులు మట్టుకా? అని అడిగెను. అందుకు యేసు అతనితో ఇట్లనెను – ఏడుమారులు మట్టుకే కాదు, డెబ్బది ఏ ళ్ళమారుల మట్టుకని నీతో చెప్పుచున్నాను’ (మత్తయి 18:21). ఈ మాటలను బట్టి చూస్తే క్షమాపణకు అంతములేదు అని మనకు అర్థమౌతుంది. ఇది చాలా శక్తివంతమైన వర్తమానము. మనలో చాలామందికి ఇది అసాధ్యమనిపిస్తుంది. కాని ఇది మన జీవితంలో తప్పనిసరిగా కనిపించాల్సిన లక్షణం. ఇంతటి క్షమాగుణానికి మనం ఎదగాలంటే, శక్తి, సహనం కోసం మనం ప్రార్థించాలి. మార్కు 11:25లో క్రీస్తు ఇలా చెప్పారు: మీకు ఒకనిమీద విరోధ మేమైనను కలిగియున్నయెడల, మీరు నిలు వబడి ప్రార్థన చేయునప్పుడెల్లను వాని క్షమించుడి” లూకా 6:36–37లో ఇలా చెప్పారు: “కాబట్టి మీ తండ్రి కనికరముగలవాడై యున్నట్టు మీరును కనికరము

గలవారైయుండుడి...” క్షమించుడి, అప్పుడు మీరు క్షమించబడుదురు”. కీర్తన 130:3-4లో ఇలా రాయబడి ఉన్నది: యెహోవా, నీవు దోషములను కనిపెట్టి చూచినయెడల, ప్రభువా, ఎవడు నిలువగలడు? అయినను జనులు నీయందు భయభక్తులు నిలుపునట్లు నీయొద్ద క్షమాపణ దొరుకును”. 2 కొరింథీ 5:14-21లో సమాధాన పరిచర్యను గూర్చి పౌలు రాశాడు. దేవుడు ఈ లోకాన్ని క్రీస్తు ద్వారా సమాధానపరచుకొన్నాడు. మనుష్యుల పాపముల ను వారిపై ఆయన మోపలేదు. క్రీస్తుచూపిన ప్రవర్తన, మాదిరి మనలో కనిపించాలని, ఇతరుల ను మనం క్షమించాలని ఈ వాక్యభాగాలు మనకు తెలియజేస్తున్నాయి.

‘డూ ఇట్ యువర్‌సెల్ఫ్: కాన్‌ఫ్లిక్ట్ రిజల్యూషన్ ఫర్ కపుల్స్’ అను పుస్తకంలో డా॥ ఫ్లోరెన్స్ బెనిఫీల్డ్ “క్షమాపణ గొప్ప స్వస్థతను ఇస్తుంది” అని తెలియజేశారు. క్షమించడం అంటే మనల్ని మనం క్షమించుకోవడం, ఇతరుల్ని క్షమించడం, ఇతరుల్ని క్షమాపణ కోరడం.

మత్తయి 18వ అధ్యాయంలో చెప్పిన విధంగా ఇతరుల్ని క్షమించడానికి, ఇతరులను క్షమాపణ కోరడానికి దేవుడు మనల్ని పిలిచాడు. ప్రభువు నేర్పిన ప్రార్థనలోని విషయాలను కూడా మనం మరచిపోకూడదు, మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములను క్షమించుము” (మత్తయి 6:12).

మనం క్షమించాలనుకొన్న వ్యక్తితో ముఖాముఖి సంభాషణ సాధ్యం కానప్పుడు, వారిని మన హృదయంలో క్షమించవచ్చు. మనం తప్పు చేశామని గుర్తించినప్పుడు, మనం ఇతరుల క్షమాపణను ఖచ్చితంగా కోరాలి.

ఎఫెసీ 4:31-32 పౌలు ఇలా తెలియజేశాడు: సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వము మీరు విసర్జించుడి... ఒకరినొకరు క్షమించుడి”. కొలస్సీ 3:12-14లో పరిశుద్ధ జీవితానికి సంబంధించిన నియమాలను పౌలు తెలియజేశాడు. “కాగా, దేవుని చేత ఏర్పరచబడిన వారును పరిశుద్ధులును ప్రియులైనవారికి తగినట్లు, మీరు జాలిగల మనస్సును, దయాళుత్వమును, వినయమును, సాత్వికమును, దీర్ఘశాంతమును ధరించుకొనుడి. ఎవడైనను తనకు

హాని చేసెనని యొకడనుకొనినయెడల ఒకనినొకడు సహించుచు ఒకనినొకడు క్షమించుడి, ప్రభువు మిమ్మును క్షమించులాగున మీరును క్షమించుడి. వీటన్నిటిపైన పరిపూర్ణతకు అనుబంధమైన ప్రేమను ధరించుకొనుడి”.

పౌలు రాసిన పై వాక్యభాగంలో క్షమాపణ, ప్రేమ విషయంలో దేవుడు చూపిన మాదిరిని మనం చూస్తాము. దేవుడు మన పాపాలను క్షమించారు. కాబట్టి మనతోటి వారిని మనం క్షమిస్తూనే ఉండాలి. క్షమాపణ దేవుని సన్నిధి మన జీవితాలలో ఉన్నది అనడానికి గుర్తు.

పరలోకపు తండ్రీ, నీవు క్షమించే దేవుడవనీ, కృపా, కనికరములు గల దేవుడవనీ, త్వరగా కోపించని వాడవనీ, ప్రేమగలవాడివనీ మాకు తెలుసు (నెహె 9:17). ప్రభువా క్షమాపణ, ఐక్యత అను బంధములలో మమ్మల్ని ఉంచుతున్న మీ ప్రేమ, కృపల నిమిత్తమై మీకు వందనాలు. కనికరముగల తండ్రీ, ఇతరుల్ని క్షమించగలిగే, ఇతరుల్ని క్షమాపణకోరే ఆధ్యాత్మిక, మానసిక, భావోద్రేక శక్తిని మాకు ఇవ్వండి. కోపం, బాధ, పగలను మానుకొని, మమ్మల్ని బాధపెట్టిన వారితో సమాధానపడే శక్తిని ఇవ్వండి. సర్వశక్తిమంతుడైన తండ్రీ, మాకోపాన్ని తగ్గించుకొని క్షమాపణను మా దైనందిన జీవితాల్లో చూపిస్తూ మీ పరిచర్య చేయడానికి మా శక్తిని వినియోగించడానికి సహాయం చేయండి.

ప్రియమైన ప్రభువా, మా పాపాలను క్షమించండి. మీ రాయబారులముగా మేము కూడా ఇతరుల్ని క్షమించడానికి సహాయం చేయండి. యేసు నామమములో ప్రార్థిస్తున్నాము తండ్రీ. ఆమెన్.

– ఎమ్మెట్ ఐ. ఆల్‌డ్రిచ్, యుయస్ఏ

అనువాదం: పి.రామస్వామి, దర్శి

ప్రత్యేకం

కుటుంబంలో కష్టాలు

"మన జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్య దేవుని శక్తిని నిరూపించే ఒక గొప్ప అవకాశం. అయితే, మనం ప్రతిరోజూ లెక్కలేనన్ని బంగారు అవకాశాలను ఎదుర్కొంటూ వాటిని అధిగమించలేని వారంగా ఉంటున్నాం" అని అంటాడు ఛార్లెస్ స్విండాల్. మన కుటుంబాల్లో ఆరోగ్యం, ఉద్యోగం, ఆర్థిక విషయాల్లో సమస్యలను ఎదుర్కోవడం, ప్రియులను కోల్పోవడం లాంటి అనేక సమస్యలు, కష్టాలను ఎదుర్కొంటూ నిరాశ, నిస్పృహలకు లోనవుతూ, ఆవేదనతో ప్రభువుకు, పరిచర్యకు దూరమవుతున్నాం. అయితే కష్టాల్లో మన స్పందన ఎలా ఉండాలి? క్లిష్ట పరిస్థితులు సంభవించినా ప్రభువు బిడ్డలు దేవుని కోసం ఎలా నిలిచారో ఈ వ్యాసంలో చూద్దాం.

యోబు ఆశీర్వాదం

యోబును గురించి దేవుడు యథార్థవర్తనుడు, న్యాయవంతుడు, దేవుని యందు భయభక్తులు గల వాడు, చెడుతనమును విసర్జించినవాడు మరియొకడు లేడని కితాబిచ్చాడు (యోబు 1:8). దేవుడు ఆయనకు ఆస్తి, ఆరోగ్యం, ఆనందం, మంచి కుటుంబం ఇచ్చాడు. ఆయనకు ఏడుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఎంతో ధనవంతుడు, ఏడువేల గొర్రెలు, మూడు వేల ఒంటెలు కలిగి తూర్పు దిక్కున ఉన్న జనులందరిలో అతనే గొప్పవాడు.

యోబు ఇంత ధనవంతుడైనా, అతడు దేవుని భయం కలిగిన వాడు. బిడ్డలు ఒకవేళ పాపం చేసి ఉంటారేమోనని ప్రతి దినం దహన బలి అర్పించేవాడు. ఆయన జీవితం గూర్చి ఆలోచిస్తే ఆయన కంటే ఆశీర్వదించబడినవారు ఎవరూ లేరని అనిపిస్తుంది. ఆస్తి, అంతస్తు, సంతోషం, సమాధానం, దేవుని యెడల భయభక్తులు కలిగి అనేక మందికి ఆశీర్వాదంగా ఉన్నాడు.

మన జీవితాలలో కూడా దేవుని కృప, కాపుదలను అనేక పర్యాయాలు చూస్తుంటాం. మన ఆర్థిక వనరులు, ఆరోగ్యం దేవుని దగ్గర నుండి వచ్చేవే. మనం అనుభవించడం కేవలం దేవుని కృప వల్లే. నిజానికి అనేక లక్షల మంది కంటే మనం ఉన్నతమైన స్థితిలో ఉంచబడిన వారం. గనుక దేవునికి నిరంతరం మనం కృతజ్ఞత కలిగి ఉండాలి.

యోబు ఆవేదన

యోబు ధనవంతుడు, యథార్థవంతుడు, దేవుని యెడల భక్తిపరుడు అయినా, ఆయన కుమారులు, కుమార్తెలు, గొర్రెలు, ఒంటెలు, ఎడ్లు అన్నీ ఒక్క రోజులోనే చనిపోయాయి. ఆయన ఆరోగ్యం కూడా పోయింది. భయంకరమైన దురద, శరీరాన్ని పెంకులతో గీస్తున్న పరిస్థితి. అయితే దేవుని దూషించలేదు. మనము దేవుని వలన మేలు అనుభవించెదమా? కీడును మనము అనుభవింపతగదా? అని ప్రశ్నించాడు. యెహోవా ఇచ్చెను, యెహోవా తీసుకొని పోయెను, ఆయన నామమునకే మహిమ కలుగును గాక! అని పలికిన యథార్థవంతుడు యోబు. తన ఆస్తి, ఆరోగ్యం అన్నిటి వెనుక దేవుని హస్తం ఉందని గ్రహించాడు. యథార్థతనే పరీక్షను నెగ్గాడు. చివరికి దేవుడు తను కోల్పోయిన సమస్తాన్ని తిరిగి ఇచ్చాడు.

జీవితం అన్నిసార్లూ మనం అనుకున్నట్లు ఉండదు

కరోనా మన జీవితాన్ని ఎంత గడిబిడి చేసిందో చూశాం. చాలా కుటుంబాలు కృంగిపోయాయి. ఆర్థిక సంక్షోభం, ఆరోగ్యం కోల్పోయి ఒకరిని ఒకరు కలిసే అవకాశం లేక ఎంత మదనపడ్డామో చూశాం. సొంతవారు చనిపోతే కనీసం సమాధి చేయడానికి

కూడా నోచుకోలేదు. హాస్పటల్ వాళ్ళు ఉన్నదంతా దోచేసే మానవత్వం లేని ప్రజలను చూశాము. భయాన్ని కలుగజేసే అనుభవాలు, దు:ఖాన్ని మిగిల్చిన అనుభవాలు, ప్రభువా మా కుటుంబానికే ఎందుకు? నీ సేవలో ఉన్నాం కదా అన్న అనుమానాలు, ఎంత ఆలోచించినా సమాధానం దొరకని అయోమయం, ఆ గాయాలు ఇంకా కొన్ని కుటుంబాలను కోలు కోకుండా చేశాయంటే అతిశయోక్తి కాదు.

బాధ, వేదన ఎవరికి ఇష్టం?

ప్రతి ఒక్కరూ సుఖాన్ని, సంతోషాన్ని కోరుకొంటారు, బాధను ఎవరు కోరుకుంటారు?

పౌలు భక్తుడు

శ్రమ పడడం కూడా దేవుడు మనకు అనుగ్రహించాడని అంటాడు (ఫిలిప్పీ 1:30). నిజానికి పౌలు చాలా సౌకర్యవంతమైన స్థానంలో ఉన్నాడు. రోమా పౌరసత్వం కలిగి గమలీయేలు వద్ద ధర్మశాస్త్రం నేర్చుకొన్నాడు. గవర్నర్ అవ్వడానికి అర్హతలు కలిగిన వాడు.

దేవుడు దమస్కు మార్గంలో సౌలును సంధించిన తర్వాత ఆయన జీవితం కష్టతరమైన మార్గంలోకి వెళ్ళింది. యేసుక్రీస్తును గూర్చిన సువార్త ప్రకటించాడు. అయితే దానిని బట్టి యూదులు అతనిని హింసించారు, చెరసాలలో వేసి, అపరిమితంగా దెబ్బలు కొట్టి, రాళ్లతో కొట్టి చనిపోయాడనుకొని ఈడ్చారు. ఆకలి, దిగంబరత్వం, ఉపవాసం అనేక రకాల శ్రమల్ని అనుభవించాడు (2 కొరింథీ 11:23-27).

శ్రమల్లో పౌలు వైఖరి

పౌలుకు దేవుని యందు విశ్వాసం, సువార్త పట్ల భారం ఉన్నాయి. సువార్త ప్రకటించాల్సిన భారం తన మీద మోపబడియున్నదని సువార్త ప్రకటించకపోతే తనకు శ్రమ అన్న భావం కలిగిన వ్యక్తి. సువార్త ప్రకటించడం కోసం ఎంతకైనా తగ్గించుకోవడానికి సిద్ధపడ్డాడు.

క్రీస్తు ప్రేమ నుండి మనలను ఎడబాపు వాడెవడు? శ్రమయైనను, బాధయైనను, హింసయైనను, కరువైనను, వస్త్రహీనతయైనను, ఉపద్రవమైనను, ఖడ్గమైనను మనలను ఎడబాపునా? (రోమా 8:35) అని ప్రశ్నిస్తున్నాడు.

పౌలు నిరీక్షణ

వెనకటివి మరిచి ముందున్న వాటికై వేగిరపడుచు,



క్రీస్తుయేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని గురి యొద్దకే పరిగెత్తుచున్నాను (ఫిలిప్పీ 3:13-14).

నేనే స్థితిలో ఉన్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగి ఉండ నేర్చుకొనియున్నాను. పౌలు దీనస్థితిలో, సంపన్న స్థితిలో, కడుపు నిండిన స్థితిలో, ఆకలిగా ఉన్న స్థితిలో, సమృద్ధి, లేమి ఇలా అన్ని విషయాల్లో దేవునికి నమ్మకంగా ఉంటూ ఆయన కార్యాలు చేయడంలో ఆసక్తిగా ఉన్నాడు. అందుకని “నన్ను బలపరచు వానియందే నేను సమస్తమును చేయగల ను” అన్నాడు.

ప్రభువును నమ్మిన పౌలు భూమిపైన జీవించే జీవితం అశాశ్వతమైనదని గమనించాడు. తనతో పాటు పరలోక రాజ్యానికి వచ్చేది కేవలం తాను ప్రభువు కోసం జీవించి, దేవుని కోసం చేసిన కార్యాలు మాత్రమే అని గ్రహించాడు. కష్టాలలో ఉన్న అనేక మందిని ఆదరించాడు. వారిని పరలోక వారసులు గా చేయడమే దేవుడు తనకు ఇచ్చిన బాధ్యతగా గుర్తించాడు.

మన జీవితాలను గురించి ఆలోచిద్దాం. పౌలు దేవుని కొరకు పడినన్ని కష్టాలు మనం పడ్డామా? ఈ ప్రశ్నకు చాలావరకు లేదు అనే సమాధానం వస్తుంది. మరి అన్ని శ్రమల్లో కూడా పౌలు దేవుని కొరకు జీవించిన జీవితం మనకు ఆదర్శంగా ఉండాలి.

మన జీవితంలో కష్టాలు

దేవుడు తన బిడ్డలకు అనుమతించే ప్రతి దాని వెనుక ఒక ఉద్దేశం ఉంటుంది.

ఆకలి, ఆర్థిక లేమిలో ఉంటే – అటువంటి వారి బాధను అర్థం చేసుకోవడానికి

ఒక భక్తుని ప్రార్థన, దేవుని జవాబు

నేను బలంగా ఉండాలని దేవునిని అడిగితే
దేవుడు కష్టాలను ఇచ్చి దాన్ని బలంగా
ఎదుర్కోమన్నాడు

నాకు జ్ఞానం కావాలి దేవా అంటే
సమస్యలిచ్చి వాటిని జ్ఞానంతో
అధిగమించమన్నాడు

నాకు ధైర్యం కావాలి దేవా అంటే
ప్రమాదాల నిచ్చి వాటిని ధైర్యంతో
ఎదుర్కోమన్నాడు

నాకు ప్రేమ కావాలి ప్రభువా అంటే
కష్టాలలో ఉన్న నిర్భాగ్యులను చూపి వారిని
ప్రేమించమన్నాడు

నాకు సహాయం కావాలి దేవా అంటే
సహాయాలు చేసే అవకాశం దేవుడిచ్చాడు

నేను అడిగింది నాకు దొరకలేదు కానీ
నాకు అవసరమైనది దొరికింది.

మన ప్రియులను కోల్పోతే – అటువంటి వారి మానసిక స్థితిని అర్థం చేసుకోవడానికి, వారిపై సానుభూతి చూపించడానికి

ఆరోగ్యం కోల్పోతే – అనారోగ్యంతో ఉన్నవారిని ఆదరించడానికి

ఆర్థిక సంక్షోభంలో ఉంటే – ఇతరుల కష్టాన్ని అర్థం చేసుకోవడానికి

నాది నాది అని వేలాడే వాళ్ళకి – ఒకరోజు దానిని వదిలి వెళ్ళాలని అర్థమవుతుంది.

దేవుని ప్రేమించు వారికి అనగా ఆయన సంకల్పం చొప్పున పిలవబడిన వారికి మేలు కలుగుటకై సమ–స్తము సమకూడి జరుగుచున్నవి (రోమా 8:28).

కష్టాలలో మనం ఏం చేయాలి?

కష్టం వైపు చూసి కృంగిపోవద్దు. దేవుని వైపు చూసి ధైర్యంగా ఉండాలి. దేవుని ఉద్దేశం తెలుసుకోవాలి. కష్టం కలకాలం ఉండదు. వాటి నుండి నేర్చుకునే అనుభవాలు అనేక మందిని అర్థం చేసుకోవడానికి, ఆదరించడానికి సహాయపడాలి. ఇతరుల కన్నీటిని, కష్టాలను అర్థం చేసుకోవడానికి నీ కన్నీటి అనుభవాన్ని ఉపయోగించు. నేను, నా అనే పరిధిలో నుండి బయటికి రావాలి.

పౌలు, యోబు వంటి భక్తుల జీవితాలు ఆదర్శం కావాలి. కష్టాలలో కూడా పౌలు సువార్త ప్రకటించడం మనకు సవాలుగా అవ్వాలి. పౌలును జైల్లో పెడితే కాపలా ఉన్న సైనికులకు సువార్త చెప్పాడు. బెత్తాలతో కొట్టి బొండాలతో కాళ్ళు బిగించినప్పుడు దేవుని స్తుతించి ఫిలిప్పీ పట్టణంలో సంఘం ఆరంభించడానికి కారణమయ్యాడు. ఆయనకు వచ్చిన కష్టాలన్నిటిని దేవునిని మహిమ పరిచే విధంగా మలుచుకొన్నాడు. ఆయన హృదయ స్పందన సువార్తే. సువార్తను ప్రకటించడానికి సిగ్గుపడువాడను కాను, సువార్త ప్రకటించవలసిన భారం నాపై మోపబడి ఉన్నది. ఏ విధము చేతనైనను ఒకని రక్షించవలెనని అందరికీ అన్ని విధముల వాడినైతిని అని చెబుతాడు. కష్టాల్లో సేవ చేశాడు, అది దేవుని పిలుపని గ్రహించాడు.

ముగింపు

కష్టాలు, నష్టాలు వచ్చాయని, మన ప్రియులను, ఆరోగ్యాన్ని కోల్పోయామని దేవుడు మనకు ఇచ్చిన పనిని వదిలిపెడదామా? లేక పౌలువలె సంతోషంగా చేద్దామా? దేవుని పరిచర్య చేస్తేనే మనకు సంతోషం, ధైర్యం, సంతృప్తి. గనుక ఎలాంటి పరిస్థితిలోనైనా దేవుని చిత్తాన్ని నెరవేర్చే వారంగా ఉందాం.

యిర్మియా ప్రవక్త అనేక కష్టాలు అనుభవించాడు. ఆయనను అన్యాయంగా హింసించారు. ఈ కష్టాలను తలచుకొని దేవుని పేరు ఎత్తకూడదన్నారు. అయితే అది తన హృదయం ముందు అగ్ని వలే మండింది. దేవుని గురించి చెప్పకుండా ఉండలేకపోయాడు (యిర్మియా 20:9).

ప్రియులారా, కష్టాలు మనకొక్కరికే కాదు క్రీస్తునందు సద్భక్తితో బ్రతకనుద్దేశించు వారికి శ్రమలు వస్తాయి (1 కొరింథీ 10:12–13). తాను నిలుచున్నానని తలంచుకొను వాడు పడకుండా జాగ్రత్తగా చూచుకొనవలెను. సాధారణంగా మనుషులకు కలుగు శోధన తప్ప మరి ఏదీ మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు. మీరు సహింపగలిగిన దానికంటే ఎక్కువగా ఆయన మిమ్మల్ని శోధింపనియ్యడు. అంతేకాదు సహింపగలుగుటకు ఆయన శోధనతో పాటు తప్పించుకొనే మార్గమును కూడా కలగజేస్తాడు.

– యం జయనేంద్ర కుమార్, గుడివాడ

పరీక్షలకు సిద్ధమేనా?

“మనస్ఫూర్తిగా పని చేయలేని వారు జీవితంలో విజయాన్ని సాధించలేరు” అంటాడు మన మాజీ రాష్ట్రపతి ఎ.పి.జె. అబ్దుల్ కలాం. పరీక్షలలో విజయం రాత్రికి రాత్రి రాదు. విజయానికి ఏడు మెట్లు లేదా విజయానికి మూడు మెట్లు చదివినంత మాత్రాన పరీక్షలలో విజయం సాధించలేము. నీ విజయం నీ సిద్ధపాటు మీద ఆధారపడి ఉంటుంది. ఫిలిప్పీ 4:13 ప్రకారం, “నన్ను బలపరచువానియందే నేను సమస్తము చేయగలను”. అంటే మొదట దేవుని మీద ఆధారపడాలి. తర్వాత సంవత్సరమంతా ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదవాలి. మరి మీ సిద్ధపాటు ఎలా ఉంది? అనేక పోటీ పరీక్షలకు, అకడమిక్ పరీక్షలకు తేదీలను ఇప్పటికే ప్రకటించారు? అయితే ఈ పరీక్షలకు సిద్ధమేనా?

2023, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం ఒక్క 2022 సం॥లోనే 13 వేల మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. 2,000 మందికి పైగా పరీక్షల్లో ఫెయిల్ అయిపోతామేమో అని ఆత్మహత్యలు చేసుకొంటే, 2,095 మంది పరీక్షల్లో ఫెయిల్ అయిన తర్వాత ఆత్మహత్యలు చేసుకొన్నారు. కాబట్టి పరీక్షల సమయం లేదా సీజన్ అనగానే అటు తల్లిదండ్రులలోను ఇటు విద్యార్థులలోను ఆందోళన మొదలౌతుంది. కొంతమందికి నిద్రపట్టదు. కొంతమంది డిప్రెషన్‌లోకి వెళతారు. ఈ సమయంలోనే కాంపిటేటివ్ పరీక్షల నోటిఫికేషన్స్ వచ్చాయి. మార్చి అనగానే పరీక్షల సమయం. ఆత్మహత్యల సంఖ్య కూడా ఎక్కువశాతం పరీక్షలు సమయంలో, పరీక్షల ఫలితాలు వెల్లడించిన తర్వాత జరగడం గమనార్హం. వీటికి చాలా కారణాలున్నాయి. ప్రధానంగా భయం, ఒత్తిడి, ఆందోళన. ఇవన్నీ విద్యార్థుల్ని డిప్రెషన్‌లోనికి తీసుకొని వెళ్తున్నాయి.

దేవుని కుమారులుగా, కుమార్తెలుగా, ఇయు విద్యార్థులుగా మన పరిస్థితి ఏంటి? వీటన్నింటిని అధిగమించి మనం ఎలా సిద్ధపడగలం? ఈ పరీక్షలలో ఎలా విజయం సాధించగలం?

పరీక్షలు ఎందుకు?

దేవుడు పరీక్షలు ఎందుకు పెడతాడు? అనే సందేహం మనలో చాలామందికి ఉంటుంది. దేవుడు ఖచ్చితంగా పరీక్షలు పెడతాడు. ఎందుకంటే సువర్ణం అగ్నిలో లేదా కొలిమిలో కాల్చబడితేనే దాని మేలిమి బయటకు వస్తుంది. అలానే దేవుడు పరీక్షల ద్వారా మనల్ని, మన విశ్వాసాన్ని, లోబడే విధానాన్ని, మన నమ్మకత్వాన్ని తెలుసుకోవడానికి మనకు ఆత్మీయ పరీక్షలు పెడతాడు. అబ్రహాము పరీక్షించబడ్డాడు. విశ్వాసులకు తండ్రిగా మార్చబడ్డాడు. యోబు పరీక్షించబడ్డాడు. అధికముగా ఆశీర్వదించబడ్డాడు. యోబు 42:12 ప్రకారం యెహోవా యోబును మొదట ఆశీర్వదించినంతకంటె మరి అధికముగా ఆశీర్వదించాడు. ఇశ్రాయేలీయులు పరీక్షింపబడ్డారు. ఆయన చేసిన ఎన్నో ఆశ్చర్య, అద్భుతకార్యాలు చూశారు కాని చాలా సందర్భాలలో ఆయనయందు విశ్వాసముంచలేదు, లోబడలేదు. కాబట్టి వాగ్దాత్త భూమిలోనికి ప్రవేశించకుండానే ఆయన మీద గొణిగి, సణిగి అరణ్యంలో రాలిపోయారు. కాబట్టి

పరీక్షలు ఉంటాయి, పరీక్షలకు ఫలితాలు కూడా ఉంటాయి.

ఆత్మీయ పరీక్షలు, అకడమిక్ పరీక్షల లక్ష్యం ఏంటి?

ఆత్మీయ పరీక్షలు మన విశ్వాసాన్ని, నమ్మకత్వాన్ని, దేవుని పట్ల మనకున్న ప్రేమను, శ్రమల్లో వెనుదిరగకుండా ఆయనను వెంబడించేటట్లు చేస్తాయి. కాబట్టి బైబిల్ గ్రంథం ఇలాంటి వారిని విశ్వాస వీరుల జాబితాలో చేర్చింది. ప్రభువు అప్పగించిన పనిని, పరిచర్యను చేసి ఆత్మీయ పరీక్షలలో విజయం సాధించి ప్రభువుతో భళా నమ్మకమైన మంచి దాసుడా, దాసురాలా అని అనిపించుకొన్నారు.

అడకమిక్ పరీక్షలు కళాశాలల్లో మన సామర్థ్యాన్ని తెలియజేసి, దేవుని సాక్షులుగా నిలబెడతాయి. యేసుక్రీస్తును స్వంత రక్షకునిగా అంగీకరించనప్పుడు ఇష్టానుసారంగా జీవించాం. కానీ ఇప్పుడు మనం దేవుని ప్రియమైన బిడ్డలం. ఆయన రక్తంలో కడగబడి, విమోచించబడినవారం. అంధకారంలో నుండి, వెలుగులోకి పిలవబడినవారం. కాబట్టి ఇయు విద్యార్థులుగా ఇప్పుడు మనం ఏం చేసినా దేవునికి మహిమకోసం చేయాలి. ఆయనకు సాక్షులుగా ఉండాలి. గతంలో రికార్డ్స్‌లో మార్కుల కొరకు డబ్బులిచ్చే వాళ్ళం. పరీక్షల్లో కాపీలు కొట్టేవాళ్ళం. కానీ దేవుని బిడ్డగా ఇప్పుడు లంచం ఇవ్వ, పరీక్షల్లో కాపీ కొట్టము. నిజాయితీగా దేవుని మీద ఆధారపడుతూ కష్టపడి చదువుతాం. జ్ఞానం కొదువుగా ఉంటే ఆయనను అడుగుతాం. ఎందుకంటే బుద్ధి విజ్ఞాన సర్వసంపదలు ఆయన యందే గుప్తమైయున్నాయి. కాబట్టి చదువు అయినా, అకడమిక్ పరీక్షలు అయినా మనుష్యుల్ని సంతోషపెట్టడానికి కాకుండా దేవునిని సంతోష పెట్టడానికి చదువుతాం, రాస్తాం. దేవుని మీద ఆధారపడుతూ కష్టపడి చదివినప్పుడు ఆయన నాకు తప్పకుండా సహాయం చేస్తాడనే నిరీక్షణ కలిగి ఉంటాం.

పరీక్షల కొరకు ఎలా సిద్ధపడాలి?

పరీక్షల్ని బాధ్యతతో రాయాలే గాని భయంతో కాదు. ప్రతీది మనం దేవుని పిల్లలంగా ఆలోచించాలి, దేవుని పిల్లల వలె కష్టపడుతూ సిద్ధపడాలి. ప్రసంగి 9:10 ప్రకారం చేయుటకు నీ చేతికి వచ్చిన యే పనియైనను నీ శక్తి లోపము లేకుండా చేయుము.

1. స్టడీ ప్లాన్ చేసుకోవాలి. నీ పరీక్షలు ఎన్ని రోజులు ఉన్నాయో చూసుకొని ఒక ప్రణాళిక వేసుకోవాలి. సబ్జెక్ట్ వైజ్ టైంటేబుల్ సిద్ధపరచుకోవాలి.
2. నీ సిద్ధపాటు సంవత్సరం/సెమిస్టర్ ప్రారంభం నుండే ఉందా? లేదా ఇప్పుడే ప్రారంభిస్తున్నావా? ఒక్కసారి సరిచూసుకోవాలి. సిద్ధపాటు ఎప్పుడూ రెగ్యులర్‌గా ఉండాలి.
3. ఇప్పటికే కనీసం సిలబస్ అంతా ఒక్కసారైనా చదివి, రివిజన్ ప్రారంభించాలి. మొదటిసారి క్షుణ్ణంగా చదవాలి. రెండవ రివిజన్ రెండు నెలల్లో పూర్తి చేసి టిప్స్ లాగా నోట్సు రాసుకోవాలి. చివరి 15 రోజుల ముందు మూడవ రివిజన్ చేయాలి. మూడవ రివిజన్ అప్పుడు టిప్స్‌లా ప్రిపేర్ చేసుకున్న నోట్స్ చదవాలి.
4. ఎక్కువసార్లు చదవడం వలన లాంగ్‌టర్మ్ మెమరీలో ఉంటుంది. గుర్తుండి పోతుంది. పరీక్షలలో అద్భుతంగా రాయగలగుతారు.
5. హోవార్డు గార్డెనర్ మల్టిపుల్ ఇంటెలిజెన్స్ థియరీని ప్రతిపాదించాడు. అతని ప్రకారం నేర్చుకునేవారు 4 విధాలుగా ఉంటారు.

   అ. చూసి నేర్చుకొనేవారు

   ఆ. విని నేర్చుకొనేవారు

   ఇ. రాసిన లేదా మాట్లాడిన పదాలు లేదా వాక్యాల ద్వారా నేర్చుకొనేవారు

   ఈ. కైనస్తటిక్ ద్వారా అంటే ఫిజికల్ యాక్టివిటీ ద్వారా నేర్చుకొనేవారు

   వీటిలో మీరు ఏ కోవకు చెందుతారు. లేదా మిక్స్‌డ్‌గా నేర్చుకుంటారా? ఒకవేళ ఇవి కాకపోయినా వేరే పద్ధతిలోనైనా. కాబట్టి మీ సిద్ధపాటులో మీరు దేనినైనా ప్రయోగించవచ్చు. ఇవే కాకుండా వివిధ రకాలైన లెర్నింగ్ టెక్నిక్స్‌ని మీ సిద్ధపాటులో వాడుకోవచ్చు.
6. ఎందుకు ఇవన్నీ అంటే చదివిన దానిని గుర్తుంచుకోవడానికి ప్రయత్నించకపోతే 24 గంటలు తిరగకముందే దానిలో 70% మార్చిపోతాం.
7. సమయాన్ని చాలా ఎఫెక్టివ్‌గా ఉపయోగించుకోవాలి.

సామెతలు 6:6 ప్రకారం సోమరీ చీమల యొద్దకు వెళ్ళుము. వాటి నడతలు కనిపెట్టి జ్ఞానమును తెచ్చుకొనుము. వాటికి ప్రణాళిక ఉంది, ఏ సమయంలో ఆహారం సమకూర్చుకోవాలో వాటికి తెలుసు. కష్టపడతాయి, పట్టుదల కలిగి ఉంటాయి. మరి మన సంగతేమిటి?

8. ఎప్పుడు చదివితే ఎంత గుర్తుంటుంది (ఒక సర్వే ప్రకారం)

   సాయంత్రం 4-7 వరకు - 40%
   రాత్రి 7-10 వరకు - 80%
   రాత్రి 10-12 వరకు - 60%
   రాత్రి 12- ఉదయం 5 వరకు - 20%
   ఉదయం 5-9 వరకు - 100%
   ఉదయం 9-1 వరకు - 60%
   మధ్యాహ్నం 1-4 వరకు - 20%

9. ప్రీవియస్ క్వశ్చన్ పేపర్స్‌ని చదివి ప్రాక్టీస్ చేయాలి.
10. ఒక ప్రత్యేకమైన స్థలంలో కూర్చొని చదవాలి. అక్కడ ఎలాంటి డిస్ట్రర్బెన్స్ ఉండకూడదు. నీవు చదివే ప్లేస్‌లోనే నీకు కావలసినవన్నీ పెట్టుకోవాలి. వాటి కోసం పదేపదే అటూ ఇటూ తిరుగుతూ సమయం వృథా చేసుకోకూడదు.
11. చదివేటప్పుడు ప్రతి గంటకు 5-10 నిమిషాల పాటు రెస్ట్ (బ్రేక్స్) ఇవ్వాలి.
12. కష్టపడి చదవాలి. కష్టపడే వారిని దేవుడు ఖచ్చితంగా దీవిస్తాడు (సామె 10:4-5).

పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

1. మంచి ఆహారం తీసుకోవాలి. ఆహారంలో ప్రొటీన్, ఫైబర్, ఫ్రూట్స్ ఉండేటట్లు చూసుకోవాలి.
2. నైట్‌అవుట్‌లు చేయకూడదు. నీకు 20% గుర్తుంటుంది. నీ బాడీ మెటబాలిజం దెబ్బతింటుంది.
3. 6-8 గంటలు ఖచ్చితంగా నిద్రపోవాలి. నిద్రలేమి అనేక రోగాలకు కారణం.
4. ఈ మధ్య ఎక్కువగా మనం వినే మాటలు, ఐ జనరేషన్, డిజిటల్ జనరేషన్, ఐపాడ్ జనరేషన్ అంటే మనం స్మార్ట్‌ఫోన్ లేకుండా బ్రతకలేము, జీవించలేము అని. కానీ మనం దేవుని బిడ్డలంగా ఈ పరీక్షల సమయంలో సెంట్‌పర్సెంట్ ఫోన్ పక్కన పెట్టడం మంచిది.

5. కొంత సమయం ఫిజికల్ ఎక్సర్‌సైజ్‌కు కేటాయించాలి.
6. ఒకవేళ ఆందోళన, భయం డిప్రెషన్, ఒత్తిడి అనిపిస్తే ప్రార్థన చేసుకోవాలి. వెంటనే మన గ్రాడ్యుయేట్ అన్నవాళ్ళని, అక్కవాళ్ళని కలవాలి. వారి దగ్గర కౌన్సిలింగ్ తీసుకోవాలి.
7. ఎట్టి పరిస్థితుల్లో క్వయిట్ టైమ్, వ్యక్తిగత ప్రార్థనను అశ్రద్ధ చేయకూడదు.

ముగింపు

ప్రియ తమ్ముడూ, చెల్లీ మీరు దేవుని దృష్టిలో చాలా ప్రత్యేకమైన వారు. తల్లిదండ్రులకు దూరంగా, హాస్టల్స్‌లో లేక రూమ్స్‌లో ఉండి పోటీ పరీక్షలకు లేదా ఇయర్/సెమిస్టర్ ఎండ్ పరీక్షలకు నీవు సిద్ధపడుతూ ఉంటే నీ దృష్టి దేవునిపై ఉంచు, ప్రభువు నామ మహిమార్థమై సిద్ధపడు. ఒకవేళ ఇప్పటివరకు అశ్రద్ధ చేస్తే ప్రభువుని క్షమాపణ అడుగు. దానియేలు, షద్రక్, మేషక్, అబెద్నెగోల వలె నమ్మకంగా ఉండి, కష్టపడదానికి ఇష్టపడితే దేవుడు పదంతల శ్రేష్టంగా ఉంచడానికి ఆయన ఇష్టపడుతున్నాడు. యెహోషువ 1:9 ప్రకారం "నేను నీకు ఆజ్ఞ ఇచ్చియున్నాను గదా, నిబ్బరము కలిగి ధైర్యముగా ఉండుము. దిగులుపడకుము, జడియకుము; నీవు నడచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును". దేవుడు నీకు తోడుగా ఉంటానని వాగ్దానం చేస్తున్నాడు. మరి నీవు మనస్ఫూర్తిగా భయం లేకుండా బాధ్యతతో యేసయ్య నామ మహిమార్థమై సాక్షిగా ఉండడానికి పరీక్షలకు సిద్ధమేనా!

- డా. యం. సాల్మన్ రాజు, వైజాగ్

కవిత

ఈ రూబీ జూబ్లీ వేళ...

ఎండిపోతున్న బీడు భూములను
తడుపుతూ తమిళనాడు నుండి
మన రాష్ట్రానికి ప్రవహించిన సెలయేరు
నెమ్మదిగా పారుతూ
నలభై ఏళ్ళుగా
విద్యార్థుల గుండెలెన్నిటినో
తడుపుతూనే ఉంది
ఆ ఏటి ప్రక్కన నాటిన
సువార్త విత్తనాలు
మొక్కలై మానులై
పాపభారంతో అలసినవారిని
సేదదీరుస్తున్నాయి
ఆత్మీయ ఆకలితో
అలమటిస్తున్న వారికి
ఫలాలనిస్తున్నాయి!

విశ్వాస భూమిలో
ప్రార్థనా పునాది వేసుకొని
సౌవార్తీకరణ, సహవాసం
సాక్ష్యాన్ని లేవనెత్తడం, ప్రేషితసేవ
అనే స్థంభాలను ఆధారంగా చేసుకొన్న
యుఇయస్ఐ భవనం
ఆధ్యాత్మిక అవసరాలతో
కృంగిన వారిని సేదదీర్చే
నివాసమైంది
నిత్య నివాసానికి చేర్చే
నిజమైన మార్గమైంది!

కాలుతున్న కాగడా కాదిది
మండుచున్న పొద
మండుచూ మండించే పొద
క్రీస్తులో శిశువులైన వారిని
శిష్యులుగా తర్ఫీదునిస్తూ
ప్రకాశింపచేసే పొద
మోషే లాంటి నాయకులెందరినో
ప్రజ్వలింపచేసే పొద
మిషనరీ విద్యార్థులుగా
టెంట్ మేకర్స్‌గా
నీతి సూర్యుని వెలుగును
లోకానికి పంచే పొద!

ఘనమైన వాక్యాధార సిద్ధాంతాలతో
మాన్యమైన మౌళిక విలువలతో
ఉప్పులా సారాన్నిస్తూ
సమాజానికి సంఘానికి సంపదలా ఉన్న
వెలకట్టలేని పరిచర్య ఇది!
ఈ లోకాధిపతి మాయలో
మనోనేత్రాలు మూసుకుపోయిన
నేటి తరానికి కళ్ళు తెరిపించే
విలువైన ప్రభుపని ఇది!

నిన్నటి జోసఫ్ అభిషేకరావు గారు
మొదలుకొని
నేటి అరుణ్ కుమార్ వరకు
గొప్పగా సేవ చేసిన
గోధుమ గింజలెన్నో..
సేవలో త్రోవలో
మాదిరి చూపిస్తున్న ఎందరో
అన్నలు, అక్కలు
త్యాగానికి ప్రతి రూపాలు
క్రీస్తు ప్రేమకు మరోరూపాలు!

నిరాశ చెందక
నిరీక్షణ వదలక
విశ్వాసానికి కర్త
దానిని కొనసాగించువాడైన
యేసువైపు చూస్తూ పరిగెత్తుదాం!
మన రాష్ట్రంలోని అన్ని కాలేజీల్లో
మార్పు చెందిన విద్యార్థి సమూహం
ఉండాలని ప్రతిజ్ఞ చేద్దాం
యుఇయస్ఐ కేతనం ఆంధ్రప్రదేశ్ అంతా
రెపరెపలాడునట్లు
ఈ రూబీ జూబ్లీ వేళ
ప్రభు పాదాల చెంత ప్రణమిల్లుదాం!

– గొంగటి మేరీజాయ్, ఆదోని

తలవంచాలి...

విజయ్ ఒక ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. విద్యార్థుల మధ్య జరిగే పరిచర్యలో, సంఘంలో కుటుంబంగా చురుకుగా పాల్గొంటాడు. విద్యార్థులకు బైబిల్ స్టడీస్, యంపిసిలు, వారిని ఇంటికి ఆహ్వానించడం, వారిని మెంటర్ చేయడం, ఇజియఫ్ మీటింగ్స్ ఇలా చాలా బిజీగా ఉంటాడు.

ఆ రోజు ఆదివారం. సాయంత్రం ఇజియఫ్ కమిటీ మీటింగ్‌లో విద్యార్థి పరిచర్య గూర్చి చర్చ జరుగుతుంది. ఆ చర్చలో యంపిసిలు సరిగా జరగడం లేదు, గ్రాడ్యుయేట్స్ ఇన్వాల్వ్‌మెంట్ సరిగా లేదు అంటుండగా... విజయ్ వారికి ఒక సలహా ఇచ్చాడు. "నెలలో నాలుగు వారాలకు ఒకవారం గ్రాడ్యుయేట్స్ ఇంటిదగ్గర, రెండవ వారం స్టూడెంట్ రూమ్స్/హాస్టల్ దగ్గర, మూడవ వారం క్యాంపస్ దగ్గర, నాల్గవ వారం ఔట్‌రీచ్ కాలేజ్ దగ్గర యంపిసి జరిగితే బాగుంటుంది". ఈ సలహాకి కమిటీలో మిశ్రమ స్పందన వచ్చింది. కొంతమందికి ఇది అస్సలు నచ్చలేదు. యంపిసిలు జరగకపోవడానికి తప్పంతా స్టూడెంట్స్‌దే అన్నట్లు మాట్లాడుతున్నారు. వారే యంపిసిలకు రావాలి. సీనియర్ స్టూడెంట్స్ అస్సలు పట్టించుకోవడం లేదు, ఏ గ్రాడ్యుయేట్స్‌ని కలవడం లేదు అని తేల్చేశారు. ఇంతలో ఒకరు 'స్టూడెంట్స్ కొంతమంది ఇళ్ళకే వెళుతున్నారు, కొంతమంది గ్రాడ్యుయేట్స్ స్టూడెంట్స్‌ని ఆకర్షించుకొంటూ, తమ చుట్టూ తిప్పుకొంటున్నారు' అంటూ విజయ్‌వైపు చూస్తూ మాట్లాడాడు.

ఇంతలో మరొకరు మాట్లాడుతూ... 'నిజమే అన్న, ప్రభువు శిష్యులుగా తయారు చేయక, తమ శిష్యులుగా తయారు చేసుకొంటూ పరిచర్యకు తూట్లు పొడుస్తున్నారు" అంటూ కొంత వెటకారాన్ని జోడించాడు.

విజయ్ ఎంతో బాధపడ్డాడు. ఈ మాటలు తన గురించేనని తనకు తెలుసు. ఎప్పటి నుంచో తన మీద ఉన్న అభియోగం అదే. ఎందుకో తెలియదు, ఈ మధ్య కాలంలో విజయ్ చెప్పిన ఏ సలహాను తీసుకోవడానికి ఇష్టపడడం లేదు. తను చేయని పనులకు మాటలు పడాల్సివస్తుందని, తనను దూరం పెడుతున్నారని తనకు అర్థమవుతుంది. ఇక ఏ మీ మాట్లాడడానికి మనస్సురాక అలా సైలెంట్‌గా ఉండిపోయాడు. మీటింగ్ అయిన తర్వాత చాలా బాధతో ఇంటికి వెళ్ళాడు.

ఇంటికి వెళ్ళేసరికి భార్య, పిల్లలు నిద్రపోతున్నారు. తన రూమ్‌కి వెళ్ళి కొంత ఫ్రెష్ అయ్యి, ప్రార్థన చేసుకొని పండుకొన్నాడు. నిద్రపట్టడం లేదు. ఆలోచిస్తూ ఉన్నాడు. తనేమి తప్పు చేస్తున్నాడు? తను స్టూడెంట్‌గా ఉన్నప్పుడు ఏమి పొందుకొన్నాడో, ఎంత

పొందుకొన్నాడో, అలాగే తిరిగి చేయాలనుకోవడం తప్పా? స్టూడెంట్స్‌ని ప్రేమించి, ప్రతివారం ఇంటికి పిలిచి భోజనం పెట్టడం ఆకర్షించుకోవడమా? వాళ్ళతో మాట్లాడుతూ, వారి సమస్యలు తెలుసుకొంటూ, వారి దగ్గరికి వెళ్ళడం లాంటివి చేస్తే నా చుట్టూ తిప్పుకోవడం అవుతుందా? అసలు కొంతమంది గ్రాడ్యుయేట్స్ ఏ పనిచేయరు, చేస్తున్న నన్ను పనిచేయనివ్వరు అని అలోచిస్తూనే పడుకొన్నాడు.

మరుసటి రోజు ఆదివారం. చాలా లేట్‌గా నిద్రలేచాడు. అప్పటికే తన పిల్లలు, భార్య చర్చ్‌కి వెళ్ళడానికి రెడీ అయ్యి విజయ్ కోసం చూస్తున్నారు. విజయ్ కూడా హడావుడిగా రెడీ అయ్యి, అందరూ కలిసి చర్చ్‌కి వెళ్ళారు. చర్చ్‌లో కూర్చొన్నాడే గానీ అసలు వాక్యం మీద మనసు పెట్టడం లేదు. చర్చ్ ముగించుకొని ఇంటికి వెళ్ళాడు.

తన మనస్సు పరిపరివిధాల ఆలోచిస్తుంది. "తనను అనిన వాళ్ళ సంగతేంటో తేల్చాలని, అలా చూస్తూ ఊరుకోకూడదని, అసలు ఇజియఫ్ మానేయాలని, కొంతకాలం సైలెంట్‌గా ఉండి ఏ విషయాలు పట్టించుకోకుండా తనపని తాను చేసుకోవాలని" అనేక ఆలోచనలతో ఏం చేయాలో నిర్ణయించుకోలేక సతమతమవుతున్నాడు. బాధలో, ఆవేశంలో ఉన్నప్పుడు సరైన నిర్ణయాలు తీసుకోలేమని, అలా తీసుకొంటే ప్రమాదకరమని తెలుసు.

తన మెంటర్ కృపారావన్న గుర్తొకొచ్చాడు. వెంటనే అన్నకు ఫోన్ చేసి కమిటీలో జరిగిన విషయమంతా చెప్పి, తనెంత బాధపడుతున్నాడో, తన ఆలోచనలు కూడా చెప్పి 'ఏం చేయమంటారన్న? అని అడిగాడు. అన్న, "తమ్ముడూ, తొందరపడకు, ప్రార్థన చేద్దాం, ఆవేశంలో తీసుకొనే నిర్ణయాలు అనర్థాలకు మూలం. కొంత కాలం ఇద్దరం ప్రార్థన చేసి దేవుని నడిపింపును బట్టి ఏమి చేయాలో ఆలోచిద్దాం" అని ఫోన్ పెట్టేశాడు.

కృపారావన్న సలహా తనకు అస్సలు నచ్చలేదు. అన్న ఎప్పుడూ ఇలానే అంటాడు. అన్నతో సెట్ అవ్వదు అనుకొంటూ మరొక గ్రాడ్యుయేట్‌కు ఫోన్ చేశాడు. ఆయన అంతా విని "తమ్ముడూ నీ తప్పేమి లేదు. వీళ్ళు పని చేయరు, చేసే వారిని మాటలు అంటూ ఉంటారు. పరిచర్య చేయడం కన్నా, పెత్తనాలకు మాత్రం పనికొస్తారు. అలాంటి వారిని కంట్రోల్ చేయాలి. మన జిల్లా, రీజినల్ కమిటీ దృష్టికి తీసుకెళ్ళి వారితో చెప్పిద్దాం" అని, ముందుగా తొందరపడకుండా కొంతకాలం ప్రార్థన చేద్దాం అని చెప్పాడు.

విజయ్‌కి అన్న ప్రారంభంలో చెప్పిన మాటలు ఉత్సాహాన్ని ఇచ్చినా, చివరి మాట చాలా నిరుత్సాహాన్ని కలిగించింది. బాధ, కోపంతో ఇజియఫ్ బైబిల్ స్టడీకి వెళ్ళడం మానేశాడు. ఎవరితో మాట్లాడడానికి ఇష్టపడడం లేదు. విజయ్ ఎందుకలా ప్రవర్తిస్తున్నాడో తన భార్యకు కూడా అర్థం కావడం లేదు.

ఒకరోజు కృపారావు అన్న దగ్గర నుండి ఫోన్ వచ్చింది. ఎలా ఉన్నావు? అని కొంతసేపు మాట్లాడి, గ్రాడ్యుయేట్స్ మీటింగ్ ఏర్పాటు చేశామని, తప్పకుండా కుటుంబంగా రమ్మని చెప్పాడు. సరేనని గ్రాడ్యుయేట్స్ మీటింగ్‌కు వెళ్ళాడు.

సాయంత్రం 7:30 అయ్యింది. మీటింగ్ హాలంతా చాలా నిశ్శబ్దంగా ఉంది. అందరితో పాటు విజయ్ కూడా శ్రద్ధగా వాక్యం వింటున్నాడు.

తన జీవితంలో జరిగిన అలజడి తనను వెంటాడుతుంది. మనస్సంతా ఎంతో బాధగా ఉంది. ఏదో కోల్పోయినట్లు, ఎంతో పోగొట్టుకొన్నట్లు, ఎవరో తనను దూరం పెడుతున్నట్లు అనిపిస్తుంది. ఆ బాధలోనే వాక్యం వింటున్నాడు.

వాక్యం చెప్పే అన్న ముగింపులో పౌలుగారి గురించి చెబుతున్నాడు. "మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని, ఇక మీదట నా కొరకు నీతి కిరీటము ఉంచబడింది" (2 తిమోతి 4:7-8) అనే వాక్యాన్ని

వివరిస్తూ... "పౌలుగారికి మరికొద్ది రోజుల్లో తనను చంపుతారని, శిరచ్ఛేదన జరుగుతుందని తెలిసినా 'నా కొరకు నీతి కిరీటము ఉంచబడింది' అని, అలాగే మనం కూడా అవమానాలకు, అనుమానాలకు, నిందలకు, అవహేళనకు, చివరికి ప్రాణ త్యాగానికైనా తలవంచాల్సిందే, అప్పుడే నీతికిరీటం పొందగలం" అంటూ ప్రసంగాన్ని ముగించాడు.

ప్రసంగంలోని చివరి మాటలు విజయ్ హృదయాన్ని బలంగా తాకాయి. తలవంచాల్సిందే అని మనసులో అనుకొంటుండగా, వారం క్రితం జరిగిన విషయాలు కళ్ళముందు ప్రత్యక్షమైయ్యాయి. అయినా పౌలుగారి జీవితాన్ని తలంచుకొని మనసులో చిన్న ప్రార్థన చేశాడు "తల వంచుతాను ప్రభువా, సహాయం చేయండి, మీ పరిచర్య కోసం మాటలు పడతాను, నా అహాన్ని, నా బాధను మీకప్పగిస్తాను".

మీటింగ్ అయిన తర్వాత అందరూ డిన్నర్‌కి వెళ్ళారు. విజయ్ కూడా డిన్నర్‌కి వెళ్ళాడు. కృపారావన్న కళ్ళు విజయ్‌ని వెదుకుతూ "తమ్ముడూ ఎలా ఉన్నావ్? నీవు చెప్పిన తర్వాత నేనూ ఎంతో బాధపడ్డాను. నీ కోసం ఎంతో ప్రార్థన చేశాను, ప్రభువు జోక్యం చేసుకోవాలని, సహవాసంలో మనస్పర్థలు పోయి, నీవు మరలా చురుకుగా పరిచర్యలో పాల్గొనాలని ఉపవాసం ఉండి ప్రార్థించాను" అంటూ గట్టిగా హత్తుకొని వీపుమీద తట్టాడు. ఆ మాటలు, ప్రేమకు విజయ్ కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

చూడు తమ్ముడూ, వ్యక్తులను బట్టి పరిచర్య చేయకూడదు, ప్రభువును బట్టి మాత్రమే పరిచర్య చేయాలి. భరించలిగితే భాగ్యవంతులం. దేవుడు నమ్మదగినవాడు. అన్యాయంగా పడే మాటలు, అవమానాలు, అవహేళనలు ప్రభువుకు కొత్తకాదు, పౌలుకు కొత్తకాదు, మనకూ కొత్త కాకూడదు. ప్రభువును బట్టి, ప్రభువు కోసం, ప్రభువు పరిచర్యకై తల వంచాల్సిందే, తగ్గించుకోవాల్సిందే, క్షమించాల్సిందే.

విజయ్ మనసులోని భాధ, భారం దిగిపోయింది. సంతోషంగా ఇంటికి వెళ్ళాడు. గతంలోవలె చురుకుగా, అందరితో కలిసి పరిచర్యలో సంతోషంగా కుటుంబంగా పాల్గొంటున్నాడు.

– యం. గాలెయ్య, భీమవరం

కవిత

ఏమైందో నీ కుటుంబానికి?

అందరితో నవ్వుతూ
అంతరంగంలో ఒంటరిగా మిగిలిపోతూ
గుండెలో బాధను లోలోపల అణిచేసుకుంటూ
పంచుకునే వారికోసం ఎదురుచూచే వారెందరో!
క్రీస్తును ఎరిగిన నీవే
ప్రేమను పంచాల్సిన నీ కుటుంబమే
పట్టీ పట్టనట్లు – పరుగులు తీస్తుంటే
వారితో మాట్లాడేదెవరు? మార్గం చూపించేదెవరు?

కన్నీటిని దాస్తున్న కన్నులెన్నో
అబద్దాలను నవ్వుతున్న పెదవులెన్నో
నిజాయితీ లేని ప్రేమలెన్నో
నచ్చకపోయినా నెట్టుకొస్తున్న జీవితాలెన్నో
యధార్థత నీ మారుపేరు కదా
సమాధానపరచడం నీ బాధ్యత కదా
నీవే వేషధారిగా జీవిస్తుంటే
వారితో మాట్లాడేదెవరు? మార్గం చూపించేదెవరు?

గంపెడు ఆశలతో రంగుల కలలతో
ఎంతో త్యాగంతో, దేవుని చిత్తంతో
కుటుంబ జీవితంలోకి అడుగులు వేసావే
ఏమైంది నీకు ఇప్పుడు?
ఆశలన్నీ అణగారినట్లు
రంగుల కలలు మసకబారినట్లు
నిన్ను నీవు నిందించుకుంటున్నావే
ఏమైందో నీ మొదటి ప్రేమ
ఎవరొచ్చారో నీకు ప్రభువుకు మధ్యలో?

భర్తకు విలువ 'గౌరవం'లో అని
భార్యకు 'అక్కర' ప్రేమేనని
విలువ కట్టలేని ఆస్తి 'పిల్లలే'నని
క్రీస్తు కేంద్రిత కుటుంబం నాదేనని
మనసులో పాడుకున్న పాటలేవి?

ఏది శాశ్వతం? కూడబెట్టిన ధనమా?
ముఖానికి ఉన్న అందమా?
గౌరవాన్ని ఇచ్చిన ఉద్యోగమా?
ప్రశ్నించుకుందాం, సరి చేసుకుందాం ఇకనైనా
క్రీస్తు కేంద్రిత కుటుంబాలుగా
జీవిద్దాం ఇప్పటి నుండైనా
ముందున్న తరాలకు మాదిరిని కనుబరుద్దాం
కలతలు లేని కుటుంబాలుగా సాగిపోదాం.

– మధిర జెస్సీ, కొల్లిపర

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**

Date of Printing: 25-01-2025
Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508

స్పర్థ

ఒకానొక స్పర్థ
భార్యొకవైపు భర్తొకవైపు
ఏకశరీరం వెయ్యిముక్కలుగా
విరిగిపోతున్న శబ్దం

కలలు పండించుకోవాల్సిన కాపురంలో
కలతల గింజల్ని నాటుకుంటారు
నిందల బోనులో చెరోవైపు నిలబడి
దూరాల శిక్షను విధించుకుంటారు

అహం కొమ్ముల్ని ఒళ్ళంతా మొలిపించుకొని
ఒకరినొకరు పొడుచుకుంటూ తిరుగుతుంటారు
అనుమానపు పడగలు విప్పుకొని
ఒకరినొకరు కసిగా కాటేసుకుంటారు

చర్చి ముగిసేదాకా
ముసుగులా కప్పుకున్న ఆధ్యాత్మికత
ఇంట్లో అడుగు పెట్టగానే ఎగిరిపోతుంది
సమాధిలోంచి పొడుచుకొచ్చిన అస్తిపంజరాల్లా
అసలు రూపాలు బయటపడతాయి

నలుగురిలో వెలిగిన నవ్వుల దీపాలు
ఇద్దరి నడుమ హఠాత్తుగా ఆరిపోతాయి
అతిథుల కచేరీలో
జంటగా ఆలపించిన యుగళగీతాలు
ఒంటరివేళ వెకిలిస్వరాలై వెక్కిరిస్తాయి

అందరిమీదా అభినందనలు కుమ్మరించే అతడు
ఆమెపై మాత్రం కోపాల కత్తులు నూరుతుంటాడు
అందరిమీదా ఆప్యాయతను కురిపించే ఆమె
అతడిలో మాత్రం లోపాల గని తవ్వుతుంటుంది

ఇద్దరూ పోటీపడి
ఇంట్లో ఒలికించిన చేదునీరు
పిల్లల వేర్లకు చేరుతుంటుంది
తప్పెవరిదో తేల్చుకొనేలోపు
కారుద్రాక్షలు పెరట్లో వేలాడుతుంటాయి

పంతాల బూజులు దులిపేసి
ఇల్లంతా ప్రేమ తోరణాలు కట్టేసి
తలుపు బయట నిలుచున్న ప్రభువును
ఇప్పుడైనా లోపలికి పిలవలేరా
ప్రభువు వాక్య ప్రమిదల్ని
ప్రతిమూలా వెలిగించుకొని
ప్రణయ కాంతుల మధ్య ఇద్దరూ కలవలేరా?

– డా. ప్రసాద్ తాళ్ళూరి